Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 286 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 నవంబర్ 2023 శనివారం పేజీలు : 4

## తీవ్రరూపం దాల్చిన మరాఠా కోటా రిజర్వేషన్ల ఉద్యమం

ముంబయి: మహారాష్ట్రలో మరాఠా కోటా రిజర్వేషన్ల కోసం చేస్తున్న ఆందోళనలు రోజురోజుకీ ఉద్ధృతమవుతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో నిరసనకారులు రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తు న్నారు. పలు చోట్ల నిరసనలు ఉద్రిక్తతలు దారి తీస్తుండటం తో కర్ణాటక ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. తాత్కాలికంగా మహారాష్ట్రకు బస్సు సర్వీసులు నిలిపేస్తున్నట్లు ఆ రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని సర్వీసులకు ఈ రూల్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్న ట్లు అధికారులు తెలిపారు. "రిజ ర్వేషన్ల కోసం ఆందోళన కర్ణాటక తో సహా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన బస్సులను ధ్వంసం చేయడానికి, దహనం చేయడానికి దారితీసింది. దీంతో కర్ణాటక సర్కార్ మహారాష్ట్రకు బస్సు సర్వీసులను నిలిపివేసింది. ఈ నెల ప్రారంభం లో బీదర్ జిల్లాలోని బాల్కి డిపోకి చెందిన బస్సు తగలబెట్టారు.




# విడుదలైన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్

## అట్టహాసంగా ప్రారంభమైన నామినేషన్ల పర్వం

### ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ

### 13న నామినేషన్ల పరిశీలన 15వ తేదీ దాకా ఉపసంహరణకు గడువు

### నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు కీలక సూచనలు

హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నగారా మోగింది. తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది కేంద్ర ఎన్నికల సంఘం. శుక్రవారం ఉదయం గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాగానే.. నామినేషన్ల పర్వం మొదలైంది.

రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడ్ స్థానాలతో సహా మొత్తం 119 నియోజకవర్గాలకు శాసనసభ్యులను ఎన్నుకోవాల్సిందిగా నోటిఫికేషన్‌లో కోరింది ఈసీ. నేటి నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 13వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అలాగే 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించింది ఎన్నికల సంఘం. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు అధికారులు. రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్వో(ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్) కార్యాలయాల్లో అభ్యర్థులు నామినేషన్ వేయాల్సి ఉంటుంది.

**నామినేషన్లు వేసే అభ్యర్థులకు సూచనలు**: నేటి నుంచి నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్ స్వీకరణ. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్ స్వీకరణ. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ ఆఫీసర్ వద్దకు అభ్యర్థి వెంట నలుగురికి అనుమతి. నామినేషన్ పత్రాలతో పాటు ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యా అర్హత వివరాలు పత్రాలను దాఖలు చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి దాఖలుకు ఒకరోజు ముందు కొత్త బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి EC కి వెల్లడించాలి. కొత్త బ్యాంక్ అకౌంట్ లోనే అభ్యర్థి ఖర్చు వివరాలను తెలపాలి. సువిధా యాప్ ద్వారా నామినేషన్ దాఖలు చేసే సదుపాయం కల్పించిన ఎన్నికల సంఘం. ఆన్లైన్ లో దాఖలు తరువాత పత్రాలను RO కు అప్పగించాలి. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల తరువాత రోజువారీ నామినేషన్ వివరాలు వెల్లడించనున్న RO, ప్రతిరోజు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడేవిట్ పత్రాలను డిస్ప్లే చేయనున్న. నామినేషన్ దాఖలు చేసిన ప్రతి అభ్యర్థి అఫిడేవిట్ పత్రాలను 24గంటల్లోనే CEO వెబ్సైట్ లో పెట్టనున్న ఎన్నికల అధికారులు. అభ్యర్థులు అవసరమైతే 15వ తేదీ వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

**3 వాహనాలు.. ఐదుగురికే అనుమతి** : శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఆ వెంటనే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించే సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వోలు) పేరు, రిటర్నింగ్ అధికారి కార్యాలయ చిరునామాను ప్రకటిస్తూ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి 'ఫారం-1'నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఉదయం 11 గంటల నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోపు ఒక్కో అభ్యర్థికి సంబంధించిన 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్‌తో పాటుగా నిర్దేశిత ఫారం-26లో అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు వంటి వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల వ్యయం పర్యవేక్షణ కోసం నామినేషన్ల దాఖలుకు కనీసం ఒకరోజు ముందు ప్రతి అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన 'సువిధ'పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చు. అయితే సంతకాలు చేసిన హార్డ్ కాపీని గడువులోగా ఆర్వోకు సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలోని 35,356 కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితా ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 3,17,17,389 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. త్వరలో ప్రకటించనున్న అనుబంధ ఓటర్ల జాబితాతో ఈ సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. డిసెంబర్ 3వ తేదీన ఓటింగ్ ఫలితాలు వెల్లడవుతాయి.

**సర్వం సిద్ధం!** : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో సమాయత్తమైంది. దాదాపుగా ఏడాది ముందు నుంచే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించింది. క్రమంగా ప్రత్యేకంగా ఓటర్ల జాబితా రెండో సవరణ, ఈవీఎంలు సిద్ధం చేయడం, ఎన్నికలు/ పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కనీస సదుపాయాల కల్పన, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాల కల్పన, భద్రత ఏర్పాట్లను పూర్తి చేసింది.

**పటిష్ట బందోబస్తు, ఎక్కడికక్కడ నిఘా** : ఎన్నికల్లో ఓటర్లను డబ్బులు, మద్యం, ఇతర కానుకలతో ప్రలోభపెట్టేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఈసారి ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. 4 రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే 17 జిల్లాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. 89 పోలీసు చెక్‌పోస్టులు, 14 రవాణా, 16 వాణిజ్య పన్నులు, 21 ఎక్సైజు, 8 అటవీ శాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని జిల్లాల్లో వీడియో నిఘా బృందాలు, వీడియో వ్యూయింగ్ టీమ్‌లు, అకౌంటింగ్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలియన్స్ టీంలు, ఖర్చుల పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 119 నియోజకవర్గాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన 67 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించింది. శాంతిభద్రతల పర్యవేక్షణ, బందోబస్తు ఏర్పాట్లు, పరిపాలన, పోలీసు విభాగాల మధ్య సమన్వయం కోసం 39 మంది ఐపీఎస్ అధికారులను నియమించింది. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న సుమారు 50 మందిని వ్యయ పరిశీలకులుగా నియమించింది. పోలింగ్ రోజు అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

## అసదుద్దీన్ బీఆర్ఎస్ పార్టీని నడుపుతున్నాడు



కామారెడ్డి జిల్లా: మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ బీఆర్ఎస్ పార్టీని నడుపుతున్నారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు కామారెడ్డి జిల్లాలో ఎన్నికల శంఖరావం పూరించారు. ఈ సందర్భంగా కిషన రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..."అవినితికి, కుటుంబ పాలనకి వ్యతిరేకంగా జరుగుతున్న యజ్ఞంలో ప్రతి ఒక్కరూ సైనికులుగా పాల్గొనాలి. పదేళ్ల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్క సెలవు కూడా పెట్టకుండా ప్రజల కోసం పని చేశాడు. పదేళ్ల కాలంలో ఒక్కరోజు కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్రటెరియట్‌కి రాలేదు. దేశంలో ఉగ్రవాదం, మతకల్లలు లేకుండా శాంతియుతంగా పాలన కొనసాగుతుంది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఘనత మోదీది. రక్తపు బొట్టు చిందకుండా రామమందిర నిర్మాణం కొనసాగుతుంది. డిసెంబర్ 3వ తేదీన తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలి. కామారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థి రమణారెడ్డిని గెలిపించి అయోధ్యలో రామామందిర దర్శనంకి తీసుకురావాలి. గత మూడున్నర సంవత్సరాలుగా ఉచితంగా రేషన్ బియ్యాం, ఎరువుల పైన రైతులకి సబ్సిడి కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. జాతీయ రహదారులన్ని కేంద్ర ప్రభుత్వం వేస్తే, రాష్ట్ర ప్రభుత్వం వేసిందని కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నాడు. 80 వేల కోట్లు అప్పు చేసి నరేంద్ర మోదీ కాళేశ్వరం ప్రాజెక్ట్‌కి ఇస్తే కేసీఆర్ కమీషన్లు తీసుకున్నాడు. 1969లో మొదటి దశ తెలంగాణ ఉద్యమంలో 368 మంది విద్యార్థులు జై తెలంగాణ అంటే...కాంగ్రెస్ ప్రభుత్వం వారిని కాల్చి చంపింది. 1200 బిడ్డల ఆత్మబలిదానల వల్ల తెలంగాణ రాష్ట్రం సాకారమైంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.




## వైఎస్ షర్మిల ఎవరో తెలియదు

## వైఎస్సార్ బిడ్డయితే ఏంటి..!?

హైదరాబాద్: వైఎస్సార్ అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డిపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నుంచి తప్పుకున్నట్లు షర్మిల ప్రకటన చేశారు. దీనిపై అసద్ మాట్లాడుతూ... "షర్మిల ఎవరో నాకు తెలియదు... ఎందుకు ఎన్నికల్లో పోటీ చేయడం లేదో తెలియదు. రాజశేఖర్ రెడ్డి బిడ్డ అయితే తోపా... అది ప్రజలు నిర్ణయిస్తారు" అంటూ కామెంట్స్ చేశారు. అసద్ ఇంకా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎవ్వరి మద్దతు లేకుండా అధికారంలోకి వస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. తొమ్మిది నియోజక వర్గాల్లో ఎంఐఎంకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో శాంతి సామరస్యలు ఉండాలి అంటే అది బీఆర్ఎస్ వల్లే సాధ్యమని చెప్పుకొచ్చారు. రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్ , జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్ ఇద్దర్నీ ఓడగొడతామని స్పష్టం చేశారు. అంబర్ పేట నుంచి కిషన్ రెడ్డి పారిపోయారని.. ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ నుండి పోటీ చేయాలన్నారు. రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోయారని.. మీడియా అందరినీ అమేథీ తీసుకుపోతే పారిపోయి వస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారన్నారు. కాంగ్రెస్‌లో సీఎం "నువ్వా నేనా" అని కొట్లాడుతున్నారని అన్నారు. బండి సంజయ్ బీసీ కదా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎందుకు తొలగించారని నిలదీస్తూ.. ఇక బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటే ఎలా నమ్మాలని అసదుద్దీన్ వ్యాఖ్యలు చేశారు.

# ఆలోచించి అడుగేయాలి

## విచక్షణ జ్ఞానంతో ఓటు వేయాలి.. లేదంటే ఐదేండ్లు బాధపడాలి : సీఎం కేసీఆర్



ముథోల్ : ఎన్నికల్లో విచక్షణ జ్ఞానంతో ఓటు వేయాలి.. లేదంటే ఐదేండ్లు బాధపడాల్సి వస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సరైన పార్టీకి ఓటు వేస్తేనే సరైన భవిష్యత్ ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ముథోల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పార్టీ అభ్యర్థి విఠల్ రెడ్డికి మద్దతుగా కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. మన దేశంలో ప్రజాస్వామ్యం వచ్చి 75 ఏండ్లు అవుతుందని కేసీఆర్ తెలిపారు. ఎన్నికలు రాగానే ఆగమాగం అవుతున్నారు. అబద్ధాలు చెప్పుడు, నిందలు వేయడం సహజమైంది. ప్రజాస్వామ్య ప్రక్రియకు రావాల్సిన పరిణితి మన దేశంలో రావడం లేదు. ఏ దేశంలో అయితే ప్రజాస్వామ్య పరిణితి వచ్చిందో ఆ దేశాలు బాగా పురోగతి చెంది ముందుకు పోతున్నాయి. ఎన్నికలు చాలా వస్తాయి. చాలా పోతాయి. ఓట్లు పడుతాయి. ఎవరో ఒకరు గెలుస్తరు. పార్టీకి ఒక్కరే నిలబడుతారు. బీఆర్ఎస్ తరపున విఠల్ రెడ్డి ఉన్నారు. వేరే పార్టీలో కూడా ఎవరో ఒకరు ఉంటారు. 30న ఓట్లు వేస్తరు. 3న లెక్క అయిపోతాయి. ఎవరో ఒకరు గెలుస్తరు. అది తప్పదు అని కేసీఆర్ అన్నారు. కానీ మీ బిడ్డగా తెలంగాణ తెచ్చిన నాయకుడిగా, బాధ్యత ఉంది కాబట్టి చెబుతున్నా.. ఎందంటే.. ఎన్నికల్లో ఒక వ్యక్తి నిలబడుతాడు. మంచి, చెడు, అతని గుణగణాలు ఆలోచించాలి. అంతే కాకుండా ఆ వ్యక్తి వెనుకాల ఏ పార్టీ ఉంది. పార్టీకి చరిత్ర ఉంటుంది. ఆ చరిత్ర ఏందో మీకు తెలుసు. ప్రజలు, రైతుల గురించి ఏం ఆలోచిస్తున్నారు అనేది ఆలోచించాలి. ఇవన్నీ మీరు విచారించి ఓటు వేయాలి. అలాంటప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతంది. విచక్షణ జ్ఞానంతో ఓటు వేయాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజల వద్ద ఉంటే వజ్రాయుధం ఓటు. సరైన పార్టీకి ఓటేస్తేనే భవిష్యత్ సరైన పద్ధతిలో ఉంటుంది. లేదంటే వచ్చే ఐదేండ్లు బాధపడాలి అని కేసీఆర్ అన్నారు. అందుకే మీరందరూ నేను చెప్పే మాటలను గ్రామాల్లో చర్చ పెట్టాలి అని సీఎం సూచించారు. పార్టీ వైఖరి, దృక్పథం, నడవడి గురించి ఆలోచించి పరిగణనలోకి తీసుకొని ఓటు వేయాలి. సరైన ప్రభుత్వం ఏర్పడితేనే మనం మంచిగా ఉంటాం. లేదంటే మనం దెబ్బతింటాం. ఒకసారి ఓటు చేతిలో నుంచి జారిపోతే చేసేదేమీ ఉండదు. ఐదేండ్ల దాకా ఏం చేయలేం. ప్రజలందరూ ఒక నిర్ణయానికి వచ్చి ఓటు వేయాలి అని కేసీఆర్ కోరారు.

**నాకు అంకాపూర్ అంటే ప్రాణంతో సమానం : సీఎం కేసీఆర్** – నాకు అంకాపూర్ అంటే ప్రాణంతో సమానం.. బహుషా ఈ ప్రపంచంలో అంకాపూర్ గురించి నేను చేసినంత ప్రచారం ఎవరూ చేయలేదు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు వస్తాయి పోతాయి.. పార్టీకి ఒకరు నిలబడుతారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ బరిలో ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. మీ అందర్నీ ప్రార్థించేది ఒక్కటే. ఇక్కడ రైతాంగం అధికంగా ఉంటది. పంటలు బ్రహ్మాండంగా పండిస్తారు.

నాకు అంకాపూర్ అంటే ప్రాణంతో సమానం. బహుషా అంకాపూర్ గురించి నేను చేసినంత ప్రచారం ఈ ప్రపంచంలో ఎవరూ చేయలేదు. అంతమంచి అభ్యుదయమైన రైతులు. అంకాపూర్ రైతుల చైతన్యంతో, వారిని స్ఫూర్తిగా తీసుకొని వందలాది గ్రామాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు.

## సంపాదకీయం

### బందీలతో హమాస్ కొత్త ఎత్తుగడ...!

గాజాలో ఇజ్రాయెల్ దళాలకు, హమాస్ ఉగ్రవాదులకు మధ్య జరుగుతున్న యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇందులో భాగంగా... ఉత్తర గాజా సొరంగాల్లోని స్థావరాలను ఇజ్రాయెల్ సైన్యం ధ్వంసం చేస్తోంది. దీంతోపాటు వైమానిక దాడులూ కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా... గడచిన 24 గంటల్లో 300 వైమానిక దాడులు జరిగాయి. ఇటు భూతల దాడులతోనూ, అటు వైమానిక దాడులతోనూ గాజాను గజలాడించేస్తూ, హమాస్ ను ముప్పు తిప్పలు పెడుతుందట ఇజ్రాయేల్ సైన్యం. ఈ క్రమంలో... గాజా నగర శివార్లలోని జబాలియాలో శరణార్థ శిబిరం ఉన్న అపార్ట్ మెంటుపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో సుమారు 50 మంది మరణించగా వందల మంది గాయపడ్డారని అంటున్నారు. ఈ సమయంలో భూతల దాడుల ఫలితంగా... హమాస్ చెర నుంచి సైనికురాలిని విడిపించింది ఇజ్రాయేల్ సైన్యం. దీంతో... సైన్యాన్ని అభినందించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. కాల్పుల విరమణ ప్రకటించేది లేదని తేల్చి చెప్పారు. ఈ సమయలో ఇప్పటికే పలు దేశాల నుంచి హమాస్ సంస్థ ఇజ్రాయేల్ కు రాయబారాలు పంపుతున్నట్లు కథనాలొస్తున్న సంగతి తెలిసిందే. దాడులు ఆపేసి తమ బందీలను విడుదల చేస్తే... ఇజ్రాయేల్ బందీలను తిరిగి అప్పగిస్తామని చెబుతున్నారు. అయితే... తమ బందీలను ఎలా విడిపించుకోవాలో తమకు తెలుసు, బేరాలు లేవన్నట్లుగా ఇజ్రాయేల్ సైన్యం దూకుడు ప్రదర్శిస్తోంది. తాజాగా ఆ దేశ ప్రధాని నెతన్యాహు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలో హమాస్ మరో ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా... తమ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయేల్ మహిళతో మాట్లాడించింది. ఈ సందర్భంగా ఆమె ఇజ్రాయేల్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 76 సెకన్ల నిడివి గల ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతుండగా... ఇది చీప్ ట్రిక్ అని, క్రూరమైన ప్రచారమని ఇజ్రాయేల్ మండిపడుతుంది. అవును... "గత 23 రోజులుగా మేం హమాస్ వద్ద బందీలుగా ఉన్నాం. మీ రాజకీయ, భద్రతా కారణాలు, సైనిక వైఫల్యం వల్ల మేం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. బందీల విడుదల కోసం ఇజ్రాయెల్.. గాజాలో భీకర దాడులు చేస్తోందని మాకు తెలిసింది. అయితే... మీరు మమ్మల్ని నిజంగా కాపాడాలనుకుంటే వారి ఖైదీలను విడిచిపెట్టండి. మమ్మల్ని విడిపించండి" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియోను హమాస్ విడుదల చేసింది. దీంతో ఈ వీడియోపై నెతన్యాహు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆ వీడియోలో మాట్లాడిన, పక్కన ఉన్న మహిళలు డేనియల్ అలోని, యెలేనా ట్రుపనోవ్, రిమన్ క్రిష్ట్ అని గుర్తించినట్లు తెలిపారు. ఇది తమను మానసికంగా దెబ్బతీసేందుకు హమాస్ చేస్తున్న క్రూరమైన ప్రచారం అని ప్రధాని అన్నారు. ఇదే క్రమంలో... బందీలను తప్పకుండా కాపాడతాం. ప్రతి ఒక్కరినీ విడిపిస్తాం అని భరోసా ఇచ్చారు. దీంతో... హమాస్ చేసిన ఈ ప్రయత్నం కూడా ఫెయిల్ అయ్యిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మరోపక్క ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణ సిరియాకు విస్తరించిందని ఐరాస ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఇదే సమయంలో... ఇజ్రాయెల్ పై దాడులు చేశామని యెమెన్ లోని రెబల్స్ గ్రూప్ హౌతీ వెల్లడించింది. దీంతో ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధంలోకి ఇరాన్ వచ్చినట్లైందని చెబుతుంది.

# ప్రజలు బిఆర్ఎస్ పార్టీకే పట్టంకడతారు

## శామీర్పేట, మూడుచింతలపల్లి మండలాల్లో పార్టీ బలోపేతం దిశగా అడుగులు

## దేశంలో అత్యధిక సంక్షేమ పథకాలు ప్రవేశ్పెటిన పార్టీ బిఆర్ఎస్

## మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి.





శామీర్పేట (గరుడ వార్త) : బిఆర్ఎస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, గతంలో ఇచ్చిన ఎన్నికల హామీలను అత్యధిక శాతం నెరవేర్చిందని బిఆర్ఎస్ పార్టీనేనని మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్పేట, మూడుచింతలపల్లి మండలాల్లోలోని శామీర్పేట్, కేశవరం గ్రామాల్లో మహేందర్ రెడ్డి పార్టీ కార్యాలయాలను ప్రారంభించి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చామకూర మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టిన ఎన్నో సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టి విజయవంతంగా కొనసాగించిందని అన్నారు. అందుకే ప్రజలు బిఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శామీర్పేట్ మండల అధ్యక్షులు విలసగారం సుదర్శన్, ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పిటిసి మహంకాళి అనితా లాలయ్య, కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి బిఆర్ఎస్ జిల్లా నాయకులు మహమ్మద్ అబ్దుల్ ఖాన్, మూడుచింతలపల్లి మండల అధ్యక్షులు మల్లేష్, ఎంపీపీ హారిక మురళి గౌడ్, మండల ఉపాధ్యక్షులు చిత్తారి యాదవ్, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి, కేశవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు భూమేష్ గౌడ్, సంజీవ్ హరిమోహన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, సాయి, మైసయ్యతో పాటుగా బిఆర్ఎస్ మండల గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు ఆరు నామినేషన్లు దాఖలు...

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి ఒక్క నామినేషన్ కూడా ధాకలు కాలేదు ...**
**మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల మొదటి రోజైన శుక్రవారం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఆరు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒకటి, కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలయ్యాయని పేర్కొన్నారు. మేడ్చల్ శాసనసభ నియోజకవర్గం నుంచి శ్రీధర్రెడ్డి జిన్న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయగా... అదే నియోజకవర్గం నుంచి ప్రవీణ్ కుమార్ రెడ్డి గౌని స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే మల్కాజిగిరి శాసనసభ నియోజకవర్గం అబ్యార్దిగా శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్, కూకట్పల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి చంద్రశేఖర్ చలిక స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఉప్పల్ శాసనసభ నియోజకవర్గం నుంచి వేరే చిన్న ధనరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా... అదే నియోజకవర్గం నుంచి ఎం.మల్లేశం తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ నుంచి నామినేషన్ వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

# గడప గడపకూ కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలు

## మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్



శామీర్పేట (గరుడ వార్త) : ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ , పోతాయిపల్లిలో కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో ఏర్పటు చేసిన "గడప గడపకు కాంగ్రెస్" కార్యక్రమానికి మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు. కాలి నడకన గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకి వివరించారు. ప్రజల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని , ఆది ఓటర్లతోనే సాధ్యమని వజ్రేష్ యాదవ్ గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కౌన్సిలర్లు, కంటెస్టెంట్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా, ఎస్ సి సెల్, బీసీ సెల్, నాయకులు, కార్యకర్తలు పెద్దయెత్తున పాల్గొనారు.

# లోహాల పేరుతో సైబర్ మోసం

వరంగల్ : 'ఆన్‌లైన్‌లో మీరు ఉక్కు లోహాన్ని రూ.465కు కొనుగోలు చేస్తే మొత్తం రూ.892.8 లాభం వస్తుంది. రాగి, వెండి, ప్లాటినం, బంగారం.. ఇలాంటి విలువైన లోహాలపై మీరు పెట్టే పెట్టుబడి కన్నా వేల రూపాయలు ఎక్కువగా వస్తాయి. ఇక పల్లాడియం కొనుగోలుకు మీరు రూ.59,875 చెల్లిస్తే 48 రోజుల్లో రూ.163,817.76. లాభం పొందవచ్చు.' ఇలాంటి ప్రకటనలతో మిమ్మల్ని ఆకట్టుకుంటారు. అరె.. వ్యాపారం భలే ఉందే.. ఇంటి దగ్గరే కూర్చొని డబ్బు సంపాదించవచ్చు.. అని నమ్మితే .. నిలువునా మునిగినట్టే. అవును సైబర్ నేరాల్లో ఇప్పుడిదో కొత్త తరహా మోసం. ఇదే కాదు, మోసగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పంథాలో సామాన్యులను నమ్మించి బ్యాంకు ఖాతాల్లో సొమ్మును కాజేస్తున్నారు. నైజీరియా మోసగాళ్లు విసురుతున్న మరో సవాల్ ఇదంటూ సైబర్ విభాగం పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా హనుమకొండకు చెందిన వ్యక్తి ఆన్లైన్‌లో ఒక కంపెనీ హంగు ఆర్భాటం చూసి లోహాలపై పెట్టుబడి పెడితే భారీ లాభాలొస్తాయని నమ్మి రూ.50వేల వరకు మోసపోయారు. కంపెనీ పేరుతో ఒక బ్రోచర్‌ను రూపొందిస్తారు. అందులో వివిధ రకాలుగా మదుపు చేసే మార్గాలను చూపిస్తారు. పైగా టిప్ టాప్‌గా తయారై కంపెనీ ప్రతినిధులు సమావేశమైన చిత్రాలు, విదేశాల్లో సకల హంగులతో ఉన్న వారి కార్యాలయం బొమ్మను బ్రోచర్‌లో పొందుపరిచి, అందులో ఇనుము, రాగి, వెండి, ప్లాటినమ్, స్వర్ణం, పల్లాడియం.. ఇలా లోహాన్నిబట్టి పెట్టుబడి నిర్ణయించి, దానిపై పెట్టుబడి పెడితే కేవలం 48 రోజుల్లో మన పెట్టుబడికి రెండు మూడు రెట్ల లాభం వస్తుందని నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఈ మధ్యే వరంగల్ కమిషనరేట్ పరిధిలో వెలుగులోకి వస్తున్నాయి.

రెండింతల లాభం: ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లు మీకు లాటరీ వచ్చిందని, ఓటీపీ చెప్పాలని మొబైల్‌లో లింకులు పంపడం, వాటిని నొక్కితే ఖాతాదారుల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయమయ్యే తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. దీనిపై సామాన్యులకు కొంత అవగాహన రావడంతో మరో కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా కరీంనగర్ కేశవపట్నం ప్రాంతానికి చెందిన ఒక బీమా ఏజెంటుకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. తాము బీమా చెల్లిస్తామని, ఆర్మీ వాళ్లమని నమ్మించారు. మొదట రూపాయి పంపితే రూ.2 చెల్లించారు. నమ్మకం కలిగించేందుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు కూడా పంపారు. ఏజెంటుకు నమ్మకం కలిగి దఫాలుగా వారికి రూ.40 వేలు చెల్లించి చివరకు మోసపోయానని తెలుసుకొని వరంగల్ సైబర్ క్రైం విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లి సైబర్ నేరాల్లో అర్ధరాత్రి డబ్బులు కాజేస్తున్న మోసాలు కూడా బయటకొస్తున్నాయి. కాజీపేటకు చెందిన జయప్రకాశ్ మెయిల్‌ను హ్యాక్ చేసి ఆయన ఖాతా నుంచి రూ.2.7 లక్షల వరకు సైబర్ నేరగాళు కాజేశారు. రాత్రివేళల్లో మొబైళ్లకు ఏవో లింకులు పంపడం, వాటిపై అవగాహన లేక నొక్కి, పడుకోగానే అర్ధరాత్రి సమయంలో ఖాతాల్లో డబ్బులు కాజేస్తుండడంతో మర్నాటికి కానీ బాధితులకు ఈ విషయం తెలియడం లేదు. మోసపోయిన కొన్ని గంటల్లో సైబర్ విభాగానికి రిపోర్టు చేస్తే మోసగాళ్ల బ్యాంకు ఖాతాలో డబ్బులు ఫ్రీజ్ చేసి మళ్లీ వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. దీంతో అర్ధరాత్రి వేళ డబ్బులను కాజేస్తే, మర్నాడు వారు ఆలస్యంగా గమనిస్తారని, దీంతో డబ్బులు వెనక్కి తీసుకోలేరనే వ్యూహంతో ఈ తరహా కొత్త మోసాలకు పాల్పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

– జనార్ధన్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్, వరంగల్ కమిషనరేట్

సైబర్ నేరగాళ్లు సామాన్యుల డబ్బులను కాజేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల లోహాలు కొనుగోలు చేయాలని, చెల్లించిన సొమ్ముకు రెట్టింపు ఇస్తామని నమ్మబలికి మోసగిస్తున్నారు. మొబైల్‌కు వచ్చే అపరిచిత లింకులు నొక్కకుండా అప్రమత్తంగా ఉండాలి.

# లేఅవుట్ అనుమతుల్లో ఇష్టారాజ్యం

రంగంపేట : 'కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) ప్రణాళిక విభాగంలో అధికారులు పాతుకుపోయారు. 25– 30 ఏళ్లుగా ఒకే దగ్గర, ఒకే ప్రాంతంలో పనిచేస్తుండటంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపే లేకుండా పోయింది. మేము ఇక్కడే ఉంటాం, మమ్మల్ని ఎవరేమీ చేయలేరనే ధోరణిలో ఉన్నారు. కొత్త లేఅవుట్ అనుమతుల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని పునఃపరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

భూ వినియోగ మార్పిడి, నాలా, ఇతర పన్నుల మదింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని తెలిసింది. ఐదు రోజుల క్రితం ఓ స్థిరాస్తి వ్యాపారి లేఅవుట్ వెంచర్‌లో భూ వినియోగ మార్పిడి(ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్) పన్ను మాఫీ చేయడం వివాదాస్పదమైంది. ఓ జూనియర్ అధికారి నిర్వాకాన్ని మరో అధికారి గుర్తించడంతో అసలు విషయం బయటపడింది. రూ.58లక్షల పన్ను వసూలు చేయకుండా లేఅవుట్ అనుమతి ఉత్తర్వులు(ప్రొసీడింగ్ కాపీ) ఇచ్చేందుకు సిఫారసు చేయడం చర్చనీయాంశంగా మారింది. భూ వినియోగ మార్పిడి పన్ను చెల్లించిన తర్వాతే అనుమతి పత్రం ఇవ్వాలని 'కుడా' వైస్‌ఛైర్‌పర్సన్ ప్రావీణ్య ఇచ్చిన ఆదేశాలు సైతం తుంగలో తొక్కారు. ఇందుకు బాధ్యుడైన సదరు అధికారికి ఛార్జి మెమో జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇలాంటి అక్రమాలు గతంలో ఎన్ని జరిగాయి? లేఅవుటు అనుమతులు రుసుములు నిబంధనల ప్రకారం పక్కాగా వసూలు చేస్తున్నారా? కుడా ప్రణాళిక విభాగంలో ఏం జరుగుతోందనే వాదన మొదలైంది. రూ.లక్ష, రూ.రెండు లక్షలు కాదు, ఏకంగా రూ.58 లక్షల ఫీజుపై నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పుపడుతున్నారు. 'కుడా' అధికారులు జరిగిన తప్పును సమర్థించుకుంటున్నారు. ప్రొసీడింగ్ కాపీ ఇచ్చినంత మాత్రన ఏం కాదని, తర్వాతయినా వసూలు చేయొచ్చని వ్యాఖ్యానిస్తున్నారు. సాధారణ, మధ్య తరగతి ప్రజల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ రుసుములు ముక్కుపిండి వసూలు చేశారు. పైసాతగ్గించ లేదు. అదే స్థిరాస్తి వ్యాపారులపై ప్రేమ చూపించడం వెనుక మామూళ్ల బంధం ఉందనే విమర్శలు వస్తున్నాయి.

డీపీఎంఎస్ దస్త్రాలపై అనుమానాలు

భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు టీఎస్– బీపాస్ ద్వారా ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సూచించింది. పది నెలలుగా ఇదే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. పాత డీపీఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలన్నీ క్లియర్ చేసేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ 'కుడా' పరిదిలో 48 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండు, మూడు నెలలుగా వీటిని పరిష్కరిస్తున్నారు. 43 దస్త్రాల స్థలాలను 'కుడా' వీస్మీ, ప్రణాళికాధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత లేఅవుట్ అనుమతుల ఫీజులు ఖరారు చేశారు. హడావుడిగా రుసుములు వసూలు చేశారు. కొంత మంది పెద్ద స్థిరాస్తి వ్యాపారులకు మొదటి నుంచి ప్రణాళిక విభాగంలో కొందరు అధికారులు సహకరిస్తున్నట్లుగా తెలిసింది. లేఅవుటు అనుమతులు ఇచ్చిన దస్త్రాలను మరోమారు పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయంటున్నారు.

# నిఘా పటిష్ఠం

జగిత్యాల : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా అన్ని చర్యలు చేపడుతోంది. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక పోలీసు యంత్రాంగం, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి జిల్లాలో 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూంకు అనుసంధానించారు.కంట్రోల్‌రూంలో ఒక మేనేజరు, ఇద్దరు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ నిరంతరం సీసీకెమెరాలను పర్యవేక్షిస్తున్నారు. చెక్‌పోస్టుల్లో విధులు సక్రమంగా నిర్వహించని వారి వివరాలు, సీసీపుటేజీని ఎన్నికల అధికారులకు అందించనున్నారు. ఎన్నికల అధికారులు సైతం తరచూ సీసీపుటేజీని పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలోని గండి హన్మాండ్లు, ఒబులాపూర్, కమ్మునూర్, బొర్నపల్లి, రాయపట్నం, దొంగల మర్రి, కలికోట, వేంపేట, నందిచౌక్, మంచినీళ్ల



బావి, ఇందిరానగర్, రాఘవపట్నం ఎక్స్‌రోడ్, కమలాపూర్ చౌరస్తా, రాజారాంపల్లి, మల్యాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

సామాజిక మాధ్యమాలపై..చెక్‌పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ జరుగుతుండగా మరోవైపు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని నిశితంగా పరిశీలిస్తున్నారు. సంబంధిత వివరాలను అధికారులకు అందజేస్తున్నారు. జిల్లాలో నిత్యం దాదాపు 30 నుంచి 40 వరకు ఎన్నికలు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వస్తుండగా అత్యధికంగా ధర్మపురి నియోజకవర్గంలో 30 వరకు ఉంటున్నాయి. ఒక పార్టీపై మరో పార్టీ ఆరోపణలు చేసేవి ఎక్కువగా ఉంటున్నాయి. వీటిపైన కలెక్టర్, అదనపు కలెక్టర్లు నిత్యం పరిశీలిస్తున్నారు.

# మినీ భారతం..
# పారిశ్రామిక ప్రాంతం

నిర్మల్ : ఒక వైపు ప్రాణహిత.. మరో వైపు పెద్దవాగు జీవనదుల పరవళ్లు.. సిర్పూరు కాగితం మిల్లు(ఎస్పీఎం), సర్‌సిల్క్ మిల్లులతో పారిశ్రామిక ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది సిర్పూరు- కాగజ్‌నగర్ నియోజకవర్గం. ఉపాధి, వ్యాపారాల నిమిత్తం వివిధ రాష్ట్రాలకు చెందినవారు కాగజ్‌నగర్‌లో స్థిరపడ్డారు. భిన్న మతాల వారు ఉన్నప్పటికీ పండగలు, సాంస్కృతిక కార్యక్రమాలు కలిసిమెలిసి జరుపుకొంటారు. భిన్న సంస్కృతి.. సంప్రదాయాలకు నిలయమైన కాగజ్‌నగర్‌ను మినీ భారత్‌గా పిలుస్తుంటారు. నియోజకవర్గం కేంద్రం సిర్పూర్(టి) అయినప్పటికీ అక్కడ కేవలం అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే స్వీకరిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని పనులు కాగజ్‌నగర్‌లోనే కొనసాగుతున్నాయి.

1952లో నియోజకవర్గం ఆవిర్భవించింది. రాజకీయాలకు అతీతంగా ఏ ప్రాంతానికి చెందిన నేతలైనా ఆదరిస్తుంటారు ఇక్కడి ప్రజలు. పార్టీల కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యమిస్తారు. శాసనసభ పునర్విభజన అనంతరం సిర్పూర్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. గతంలో 242 క్రమసంఖ్య ఉన్న నియోజకవర్గం నెంబర్ వన్ సిర్పూర్-001గా మారింది.

స్థానికేతరులకే మొగ్గు..1952 నుంచి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. తొలిసారి సోషలిస్టు పార్టీ నుంచి బుచ్చయ్య విజయం సాధించారు. ఆ తర్వాత ఆరు సార్లు కాంగ్రెస్, మూడుసార్లు తెదేపా, మూడుసార్లు భారాస, రెండు పర్యాయాలు స్వతంత్ర, ఒకసారి బీఎస్పీ పార్టీల అభ్యర్థులు గెలిచారు. 1957లో సిర్పూర్, చెన్నూరు ఉమ్మడిగా ఉండగా, జి.వెంకటస్వామి(ఎస్సీ) కాంగ్రెస్, రాజమల్లు(జనరల్) కాంగ్రెస్ నుంచి ఇద్దరు అభ్యర్థులు గెలిచారు. 1962, 1967లో రెండు పర్యాయాలు జి.సంజీవరెడ్డి(హైదరాబాద్ నివాసి) విజయం సాధించారు. 1967లో కార్మికశాఖ మంత్రి అయ్యారు. 1972, 1978లో రెండుసార్లు కేవీ.కేశవులు(మంథని) విజయం సాధించగా, 1972లో చేనేత జౌళిశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1983, 1985లో రెండుసార్లు కేవీ నారాయణరావు(విజయవాడ) గెలుపొందారు. 1985లో ప్రభుత్వ చీఫ్ విప్‌గా అప్పటి సీఎం ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరుందేది. 1989, 1994 రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పాల్వాయి పురుషోత్తంరావు(బెజ్జూరు) గెలుపొంది, ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1999లో తెదేపా అభ్యర్థిగా పాల్వాయి పురుషోత్తంరావు పోటీ చేయగా.. ఎన్నికలకు రెండురోజుల ముందు మావోయిస్టులు కాల్చి చంపారు. అనంతరం ఆయన సతీమణి పాల్వాయి రాజ్యలక్ష్మి(తెదేపా) నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009, 2010 రెండు సార్లు తెరాస(భారాస) కావేటి సమ్మయ్య విజయం సాధించారు. 2009 మే 16న జరిగిన ఎన్నికల్లో కావేటి సమ్మయ్య గెలుపొందగా, ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2010 ఫిబ్రవరి 14న రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక జరిగింది. ఆ సమయంలో 273 రోజుల పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. 2004, 2014, 2018లో కోనేరు కోనప్ప విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్, 2014లో బీఎస్పీ, 2018లో భారాస నుంచి పోటీ చేసి గెలుపొందారు.నిజాం కాలంలో 1932లో కాగజ్‌నగర్‌లో రెండు భారీ పరిశ్రమలు సర్‌సిల్క్, ఎస్పీఎంలను స్థాపించారు. నూలు వస్త్ర పరిశ్రమ(సర్‌సిల్క్) కొన్నేళ్లపాటు వస్త్రాల ఉత్పత్తిలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద పరిశ్రమగా పేరుందేది. 1982లో విద్యుత్తు, సాంకేతిక సమస్య కారణంగా మిల్లు మూతపడింది. రాష్ట్రంలోనే ఏకైక కాగితం పరిశ్రమ(ఎస్పీఎం). ఎన్నికల్లో ఎస్పీఎం కార్మికుల ఓట్లు కీలకం. మిల్లులో దాదాపు ఏడువేల మంది కార్మికులుండగా, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 20 వేల మందిపైనే ఉన్నారు.

17 గ్రామాలు... 20 వేల ఓట్లు

1965లో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన కాందిశీకులు నియోజకవర్గంలోని పలు మండలాల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. 17 గ్రామాల్లో దాదాపు 20వేల ఓటర్లున్నారు. ఉపాధి నిమిత్తం ప్రభుత్వం అయిదెకరాల వ్యవసాయభూమి. ఎనిమిది గుంటల నివాస స్థలం కేటాయించింది. నియోజకవర్గంలో రాజకీయ ఫలితాలపై ప్రభావం చూపగలిగే బెంగాలీ ఓటర్లు కీలకం.

# ఆధ్యాత్మికం.. మూడు జిల్లాల సమాహారం



వేములవాడ: దక్షిణ కాశీగా, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగానూ వేములవాడకు పేరుంది. వేములవాడ పట్టణంలో శ్రీరాజరాజేశ్వరస్వామి కొలువై ఉండటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు రోజూ వేలాదిగా స్వామివారి దర్శనానికి రావడంతో వేములవాడకు ఆధ్యాత్మిక పట్టణంగా పేరొచ్చింది. వేములవాడ మొదట సిరిసిల్ల నియోజక వర్గంలో ఉండేది. 2009 సంవత్సరంలో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వేములవాడ నూతన నియోజకవర్గంగా అవతరించింది. ఈ నియోజక వర్గం మూడు జిల్లాల కలయికతో వేములవాడ, వేములవాడ గ్రామీణం, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలతో కలిపి ఏర్పాటైంది. భౌగోళికంగా చూస్తే మాత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అయిదు మండలాలు, జగిత్యాల జిల్లాలోని మూడు మండలాలతో కలిపి నూతన నియోజక వర్గంగా వేములవాడ ఆవిర్భవించింది.

వేములవాడ నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో ఈ ప్రాంతం నుంచి బతుకుదెరువు కోసం వేల సంఖ్యలో యువత ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు 80 శాతం మంది వ్యవసాయం, బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తుంటారు. పత్తి, వరి, మొక్కజొన్న, పసుపు ఇతరత్రా పంటలకు ఈ ప్రాంత నేలలు అనువుగా ఉంటాయి. ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా వేములవాడ గ్రామీణ మండలంలోని పాజుల్‌నగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాలకు కాలువల ద్వారా సాగు నీరు అందుతోంది. వేములవాడలో ప్రాంతీయ ఆసుపత్రి, అగ్రహారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ముఖ్యంగా వేములవాడ నుంచి చందుర్తి, రుద్రంగి మీదుగా కోరుట్ల వైపు, అలాగే వేములవాడ నుంచి కొండగట్టు, హైదరాబాద్, కరీంనగర్ వైపు నియోజకవర్గానికి ప్రధాన రహదారులు ఉన్నాయి. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజక వర్గాలకు వేములవాడ మండలంలోని అగ్రహారం నుంచి మిషన్ భగీరథ శుద్ధజలం సరఫరా అవుతోంది. నూతనంగా ఏర్పాటైన వేములవాడ నియోజక వర్గంలో మొదటి నుంచి చెన్నమనేని రమేశ్‌బాబు ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు.

నక్సలైట్ల ఖిల్లాగా పేరు..

వేములవాడ నియోజక వర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో గతంలో జనశక్తి, మావోయిస్టు పార్టీల ప్రాబల్యం అధికంగా ఉండేది. అందుకే ఈ నియోజక వర్గం నక్సలైట్ల ఖిల్లాగా పేరుగాంచింది. రోజూ ఓ వైపు నక్సలైట్లు, మరో వైపు పోలీసుల బూట్ల చప్పుళ్లతో గ్రామీణ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. పోలీసుల ఎన్‌కౌంటర్లలో చాలా మంది నక్సలైట్లు, నక్సలైట్ల చేతిలో పోలీసులు, అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా రుద్రంగి మండలంలోని మానాల మావోయిస్టులకు కేంద్ర బిందువుగా ఉండేది. అక్కడి నుంచే మావోయిస్టు కార్యకలాపాలు కొనసాగేవి. మిగతా మండలాల్లో జనశక్తి ప్రాబల్యం అధికంగా ఉండేది. ఈ నియోజక వర్గంలోని చాలా గ్రామాల్లో నక్సల్స్ ఉద్యమంలో అమరులైన మావోయిస్టు, జనశక్తి నాయకుల స్మారక స్తూపాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. మానాలలో మావోయిస్టు అమరుల భారీ స్తూపం నిర్మించారు. చందుర్తి మండలంలోని లింగంపేట అటవీ ప్రాంతం వద్ద పోలీసు అమరవీరుల భారీ స్తూపం ఉంది.

# వాహన భద్రతకు భరోసా కరవు..!



నిర్మల్ : ఉమ్మడి జిల్లా పరిధిలోనే అతిపెద్ద ప్రయాణప్రాంగణంగా పేరున్న నిర్మల్‌లో వాహనాల భద్రతకు భరోసా కరవైంది. కొద్దిరోజులుగా బైక్‌స్టాండ్ అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఫలితంగా ప్రయాణికులకు అవస్థలు తప్పటం లేదు.

పట్టణంలోని చింతకుంటవాడకు చెందిన శ్రీధర్ అనే యువకుడు ఇటీవల బస్టాండ్ ఆవరణలో తన ద్విచక్రవాహనం నిలిపి ఉంచాడు. పనినిమిత్తం బయటకు వెళ్లొచ్చాడు. కొంత సమయం అనంతరం వెళ్లిచూస్తే వాహనం కనిపించలేదు. ఎవరో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కలిసి ఆ వాహనాన్ని అపహరించారని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనదారులకు ఇబ్బందులు..జిల్లాకేంద్రం, ప్రధాన వ్యాపారప్రాంతం కావడంతో నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్రా అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు, వచ్చేవారు వందల సంఖ్యలో ఉంటారు. వీరంతా ప్రతిరోజూ ఉదయమే బస్టాండ్‌కు చేరుకొని అక్కడ్నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్తొస్తుంటారు. చాలామంది తమ ద్విచక్రవాహనాలపై వచ్చి, అక్కడి స్టాండ్‌లో పార్క్ చేస్తుంటారు. సుమారు పక్షం రోజులుగా ఈ స్టాండ్ లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. కొంతమంది ప్రాంగణంలోనే ఖాళీప్రదేశాల్లో, చెట్లనీడన వాహనాలను నిలుపుతున్నారు. ఇదంతా భద్రతపరంగా సమంజసం కాకపోయినా.. గత్యంతరం లేక కొనసాగిస్తున్నారు.బస్సు డ్రైవర్లకు కష్టాలు

ద్విచక్రవాహనాలను ఇష్టారీతిన పార్క్ చేస్తుండటంతో బస్సు చోదకులకు అవస్థలు ఏర్పడుతున్నాయి. బస్సులు వచ్చేటపుడు, వెళ్లే సమయంలో, రివర్స్ తీసుకునేందుకు, పక్కన ఆపేందుకు.. ఇలా అన్ని సమయాల్లోనూ బైక్‌ల కారణంగా ఆటంకం ఏర్పడుతోంది. ప్రధానంగా బస్సుల రద్దీ ఎక్కువగా ఉన్నపుడు సమస్య మరింత జటిలంగా మారుతోంది.

ఆదాయంలో కోత..

స్టాండ్ నిర్వహణ కోసం టెండర్లు నిర్వహించడం, అధిక మొత్తంలో ఎవరు అద్దె చెల్లించేందుకు ముందుకొస్తే వారికి నిర్వహణను అప్పగించడం వల్ల ఆర్టీసీకి అదనంగా ఆదాయం లభించేది. ప్రస్తుతమున్న స్టాండ్‌ను తొలగించడం వల్ల ఈ ఆదాయానికి కోత పడినట్లయ్యింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అది సంస్థకు పెద్ద నష్టం కల్గించే విషయం కాకపోయినా, చాలామంది ప్రయాణికులకు మాత్రం ప్రధాన సమస్యగా మారింది.

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం..

ప్రయాణప్రాంగణం ఆవరణలో బైక్ స్టాండ్ ఏర్పాటుకు గతంలో టెండర్లు నిర్వహించారు. బైక్‌స్టాండ్ నిర్వహణను దక్కించుకున్న గుత్తేదారు అక్కడ ప్రత్యేకంగా షెడ్డులాంటి నిర్మాణం చేపట్టారు. వాహనాలకు నీడ కోసం ఏర్పాట్లు చేశారు. వారిచ్చిన రసీదు లేకుండా వాహనం తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో అక్కడ వాహనాలకు కాస్త భద్రత ఉండేది. దీంతో చాలామంది బైక్‌ను నిలిపి నిశ్చింతగా తమ పనులు చేసుకొని వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ప్రాంగణం ఆవరణలో రూ.35 కోట్ల నిధులతో నూతనంగా ఆర్టీసీ కాంప్లెక్స్ (వాణిజ్య సముదాయం) నిర్మించతలపెట్టారు. ఇందుకోసం 1.03 ఎకరాల స్థలం కేటాయించారు. అదనంగా మరికొంత స్థలం కూడా అవసరమవడంతో అప్పటికే అక్కడ నిర్వహిస్తున్న బైక్ స్టాండ్‌ను తొలగించాల్సి వచ్చినట్లు డిపో అధికారులు పేర్కొంటున్నారు.

# అండాలమ్మకాలనీ.. అవస్థలే అన్నీ

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీవాసులకు అన్నీ అవస్థలే.. సమీపంలోనే చెత్త డంప్‌యార్డు ఉండటంతో దుర్వాసన వస్తోంది. రెడీ మిక్స్ ప్లాంట్‌తో దుమ్ము, శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దుమ్ము, శబ్ద కాలుష్యంమూడేళ్ల కిందట అండాలమ్మకాలనీలో నివాస గృహాల పక్కనే రెడీ మిక్స్ ప్లాంటు ఏర్పాటు చేశారు. అక్కడ తయారు చేసిన కంకరను పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆ పరిశ్రమ యజమానులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదు. రెడీ మిక్స్ ప్లాంట్‌లో వెలువడే దుమ్ముతో అనారోగ్యం భారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంకర తయారు చేసినప్పుడు భారీగా శబ్దం వస్తోందని వాపోయారు. దుమ్ము, శబ్ద కాలుష్య సమస్య పరిష్కరించాలని పరిశ్రమ యజమానిని కోరినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. అందుకే నివాస గృహాల పక్కన ఉన్న రెడీ మిక్స్ ప్లాంట్ తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కు, జిల్లా అధికారులకు వారు ఫిర్యాదు చేశారు. పొగతో ఉక్కిరిబిక్కిరి అండాలమ్మకాలనీలో మున్సిపల్ అధికారులు తాత్కాలిక చెత్త డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. పట్టణంలో వెలువడే చెత్తను అక్కడ డంప్ చేయడంతో భారీగా కుప్పలు పేరుకుపోయాయి. చెత్తను కాలబెట్టడంతో వెలువడే పొగ కాలుష్యంతో కాలనీ వాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. దుర్వాసన, పొగ కాలుష్యం భరించలేక కాలనీ సమీపంలో ఉన్న గురుకుల విద్యార్థులు ఇంటికి వెళ్లిపోవడంతో పాఠశాల కొద్ది రోజులు మూతపడింది. తర్వాత ఆ గురుకులాన్ని హాజీపూర్ మండలంలోని ముల్కల్లకు మార్చారు. డంప్‌యార్డు తొలగించాలని చెత్త తరలించే వాహనాలను కాలనీవాసులు అడ్డుకున్నారు. రెండు నెలల్లో ముల్కల్లలో కేటాయించిన ప్రభుత్వ స్థలంలోకి మారుస్తామని అధికారులు చెప్పారు. కానీ తరలింపులో జాప్యం చేస్తున్నారు.

# ధరావతు దక్కలేదంటే..?

నడిగూడెం : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఫలితాలు వెలువడ్డాక కొంతమందికి డిపాజిట్ (ధరావతు) కూడా దక్కలేదని వింటుంటాం. అసలు డిపాజిట్ అంటే ఏమిటీ? డిపాజిట్ కోల్పోవడమేంటి? అనేది చాలామందికి అర్థం కాదు. ప్రధాన, ఇతర రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తుంటారు. వీరు సెక్యూరిటీ డిపాజిట్‌గా నగదు కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో సరదాగా పోటీ చేసే వారికి అడ్డుకట్ట వేసేందుకే ఈ పద్ధతి అమల్లోకి వచ్చింది. 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 34(1)(ఎ) నిబంధన ప్రకారం పోటీ చేసే వారు ఈ ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. 1996 కంటే ముందు ఎస్సీ, ఎస్టీలకు రూ.250, మిగతా వారు రూ.500 ధరావతు చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వారు ధరావతు రూ.10 వేలు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. లోక్‌సభకు పోటీచేసే వారు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.12,500 డిపాజిట్ చేయాలి. ఎన్నికల నియమావ



ళిని అనుసరించి అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటప్పుడే ఈ ధరావతు సొమ్ము చెల్లిస్తారు. కొన్ని రోజుల తర్వాత నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. మరికొన్ని రోజులకు పోలింగ్ జరుగుతుంది. పోలైన ఓట్లను లెక్కిస్తారు. వీటిలో ఆరింట ఒకవంతు అంటే.. 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి ధరావతు సొమ్ము తిరిగి ఇస్తారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న వారికి, విజేతలకూ ఈ సొమ్ము ఇచ్చేస్తారు. ఈ ఓట్లు కూడా రాకపోతే వారికి డిపాజిట్ (ధరావతు) నగదు తిరిగివ్వరు. దీన్ని ధరావతు జప్తు చేయడం అంటారు. ఈ సందర్భాల్లోనే సదరు అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కలేదంటారు.

ఓటుహక్కు ఎలా వచ్చిందో తెలుసా..?

భారతదేశంలో 1950 నుంచి సార్వత్రిక ఓటుహక్కు అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని 326 అధికరణం ద్వారా సార్వత్రిక ఓటుహక్కు కల్పించారు. ఇది ప్రపంచ రాజకీయ చరిత్రలో ఒక విప్లవాత్మకమైన చర్య. ఎందుకంటే సార్వత్రిక ఓటుహక్కు అమలు కావడానికి చాలా దేశాలలో వందల సంవత్సరాలు పట్టింది. భారతదేశంలో సార్వత్రిక ఓటుహక్కు వచ్చేనాటికి గ్రీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, స్విట్జర్‌లాండ్ తదితర దేశాలలో కొన్నివర్గాలకు ఓటుహక్కు అందలేదు. ఇదీ భారత రాజ్యాంగం చూపిన రాజకీయ పరిణతి.

# కోత దశలో
# కానరాని సాగునీరు

నడిగూడెం : సాగర్ ఎడమ ప్రధాన కాల్వ పరిధిలోని మునగాల, నడిగూడెం మండలాల ప్రాంతంలో మూడు చోట్ల డీప్‌కట్‌లు(అతి లోతైన ప్రదేశాలు) ఉన్నాయి. సాగర్ కాల్వలో నీటి విడుదల నిలుపుదల చేసినా ఈ ప్రాంతాల్లో అయిదు నుంచి ఆరడుగుల మేరకు సాగునీరు ఎల్లప్పుడూ నిల్వ ఉంటుంది. గత 30 ఏళ్ల నుంచి ఎప్పుడూ డీప్‌కట్‌లో చుక్కనీరు కూడా లేని సందర్భాల్లేవని స్థానిక రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఏడాది సాగర్ జలాశయానికి పూర్తి స్థాయిలో సాగునీరు చేరకపోవడంతో కాల్వలకు నీరు విడుదల చేయలేదు. గత నెలలో ఒక తడి కోసం పది రోజులు సాగర్ నీరు విడుదల చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని నడిగూడెం, మునగాల, నారాయణగూడెం, కృష్ణానగర్, చాకిరాల, రామాపురం, కేఆర్సీపురం, సిరిపురం గ్రామాల రైతులు కాల్వ కట్టలపై పంపు మోటార్లను ఏర్పాటు చేసుకొని తమ పంట పొలాలకు సాగునీరు తరలిస్తున్నారు. కాల్వకు నీరు విడుదల



చేయకపోయినా డీప్‌కట్‌ల వద్ద నిల్వ ఉన్న నీటితో పంటలు పండించుకునేవారు. ఈ ఏడాది నెలకొన్న పరిస్థితులతో డీప్‌కట్‌లు సైతం ఎండిపోయి సాగులో ఉన్న పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు పొట్ట దశకు చేరకున్నాయని, మరో పక్షం రోజుల్లో కోతకు వచ్చే కీలక దశలో సాగునీరు అందకపోవడంతో పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కాల్వకు ఒక తడి నీరు విడుదల చేస్తే సాగులో ఉన్న వేల ఎకరాల పంట చేతికొస్తుందని రైతులు కోరుతున్నారు.

# భువనగిరి కోట అభివృద్ధికి అడుగులు

భువనగిరి : స్వదేశీ దర్శన్ పథకం అమల్లో భాగంగా భువనగిరి కోటలో చేపట్టనున్న నిర్మాణాల విషయమై కోట పరిసరాలను పురావస్తుశాఖ, టూరిజంశాఖ అధికారులు సంయుక్తంగా పర్యటించారు. స్వదేశీ దర్శన్ నిర్మాణాలు చేపట్టేందుకు తొలి విడతగా రూ.60 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులతో బైపాస్ రోడ్డు నుంచి రోప్‌వే, సంతోషిమాతా ఆంజనేయ ఆలయం పరిసర ప్రాంతం నుంచి మూడు లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లతో పాటు కోటపై మధ్య, పైభాగం, కింద క్యాంటిన్లు, పార్క్‌లు నిర్మించనున్నారు. నిర్మాణాలు చేపట్టే ప్రాంతాలను టూరిజంశాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి, పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి టూరిజం అధికారి ధనంజేయులు పరిశీలించారు. ప్రాథమిక నిర్మాణాల నమూనాలపై ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి గంగాధర్, మేనేజర్ సుమతి అధికారులకు అవగాహన కల్పించారు. నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా ఉన్న నాలుగు ప్రాంతాలను అధికారులు ఎల్ అండ్ టీ అధికారులతో కలిసి పరిశీలించారు. కోట కింద, మధ్య, పైన రాజభవనం ఉన్న ప్రాంతాలను పరిశీలించి చర్చించారు. నిర్మాణాల విషయమై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎల్ అండ్ టీ అధికారులను కోరారు.

# సన్న బియ్యం.. వసూళ్ల పర్వం!

జనగామ : పేదలకు ఆకలి బాధ లేకుండా ప్రభుత్వం ఆహార భద్రత కింద బియ్యం అందజేస్తోంది. జిల్లాల్లోని ఎం.ఎల్.ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు కేటాయిస్తోంది. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చింది. కొంతకాలంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు గోదాం నిర్వాహకులు, హమాలీలు కాసులిచ్చిన వారికే సన్నబియ్యం అందిస్తున్నారు. లేదంటే దొడ్డు బియ్యం అంటగడుతున్నారు. ఈ విషయమై హనుమకొండ ఎం.ఎల్.ఎస్ పాయింట్ వద్ద రేషన్ డీలర్లు ఆందోళన చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండు పాయింట్లు: హనుమకొండ జిల్లాలో 414 రేషన్ దుకాణలు న్నాయి. 2,28,211 రేషన్ కార్డులున్నాయి. ఆయా కుటుంబాల్లో మొత్తం 6,76,059 లబ్ధి పొందుతున్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రతి నెల 42,71,552 కిలోల బియ్యం డీలర్లకు సరఫరా చేస్తోంది. ఇందుకోసం జిల్లాలో రెండు ఎంఎల్ఎస్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒకటి హనుమకొండలో, మరొటి పరకాలలో ఉంది. బస్తాకు రూ. 500: గతంలో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద అక్రమాలు జరుగుతున్నాయని, బస్తాలో కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం



తక్కువ వస్తుందని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం ఇటీవల ఈ-పాస్ యంత్రాల ద్వారా డీలర్ల నుంచి వేలి ముద్రలు తీసుకొని బియ్యం కేటాయింపులు జరగాలని నిర్ణయించింది. నిర్వాహకులు అక్రమాలకు కొత్తదారి మొదలుపెట్టారు. సన్నబియ్యం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతు న్నారు. బస్తాకు రూ. 500 ఇస్తే సంబంధిత డీలర్లకు సన్నబియ్యం ఇస్తామని తెరలేపారు. షాపుల ద్వారా డబ్బులు ఇస్తున్న వారికి సన్నాలు, లేకుంటే దొడ్డు బియ్యం ఇస్తుండటంతో గొడవ మొదలైంది. ఏడాదిగా ఇదే తంతు కొనసాగిస్తున్నారని రేషన్ డీలర్లు ఆందోళన చేపట్టినట్లు తెలిసింది. గోదాం నిర్వాహకులు హమాలీలతో కలిసి అక్రమ వసూళ్లకు తెరలేపారని ఆరోపించారు. గొడవ పెద్దది కావడంతో డీలర్ల సంఘం నాయకులు అక్కడికి వచ్చి.. ఇరువర్గాలతో మాట్లాడారు.

# గడువులోపు సేకరణ సాధ్యమేనా?

జగిత్యాల : బాయిల్డ్, రారైస్ మిల్లుల నుంచి గడువులోగా బియ్యం వెనక్కి వస్తేనే గోదాముల్లో నిల్వచేయటం, భారత ఆహార సంస్థకు కేటాయింపు, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక రైళ్ల ద్వారా తరలింపు సాధ్యపడుతుంది. మరోవైపు మిల్లులు, గోదాములు, నిల్వకేంద్రాల్లోని ధాన్యాన్ని మరాడించి తరలిస్తేనే ప్రస్తుత వానాకాలం పంటను సజావుగా కొనుగోలు చేసే వీలుంటుంది. కానీ ఇప్పటికీ జిల్లాలో గత రెండు సీజన్లకు చెందిన 3.62 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉండటం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. పైగా కొందరు ప్రభుత్వమిచ్చిన ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని ప్రైవేటుగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. వీటిస్థానంలో మళ్లీ రైతుల నుంచి ధాన్యం నేరుగా కొని లేదా పీడీఎస్ బియ్యాన్ని కొని ప్రభుత్వానికి ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవలే జగిత్యాల లింగంపేట రైల్వేస్టేషన్ నుంచి తమిళనాడుకు బియ్యాన్ని నింపి ఓ మిల్లర్ వ్యాగన్‌ను తరలించగా మరికొన్ని వ్యాగన్లలో బియ్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పౌరసరఫరాల సంస్థ వేబిల్లులు ఇవ్వకుండా, ఇంత పెద్దఎత్తున రైలులో బియ్యాన్ని ఎలా తరలిస్తున్నారనేది ప్రశ్నగా మారింది. దీనిపై జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ బియ్యం తరలింపు తమ దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సీఎంఆర్‌ను గడువులోగా ఇవ్వని మిల్లులకు ధాన్యాన్ని కేటాయించమని పేర్కొన్నారు.

ధాన్యం సేకరణపై ప్రభావం

దాదాపుగా 70 శాతం సీఎంఆర్ ఇచ్చిన మిల్లులకే ధాన్యం ఇస్తామని ప్రభుత్వం పేర్కొనగా కొన్ని మిల్లులకు కేటాయించే అవకాశంలేక తరలింపు అవకాశాలు తగ్గనున్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ సేకరణ జాప్యాన్ని తీవ్రంగా పరిగణించగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, భారత ఆహారసంస్థ అధికారులు కస్టమ్ మిల్లింగ్ వేగవంతం చేయటంపై దృష్టిసారించారు. గిడ్డంగుల్లో సకాలంలో బియ్యాన్ని దింపుకొనేందుకు హమాలీలను సమకూర్చుకోవటం, గోదాముల్లో ఖాళీస్థలాన్ని అందుబాటులో ఉంచటం తదితరాలపై దృష్టిసారించి రోజుకు కనీసం 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం గోదాములకు రావాలని నిర్దేశించారు. ఇదే తరుణంలో జిల్లాలో ధాన్యం కల్లాలకు వస్తుండగా మరో వారం రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉంటుంది. జిల్లాలో 398 కేంద్రాలను ఏర్పాటుచేసి దాదాపుగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అంచనా ఉండగా ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ప్రభుత్వం అనుమతించిన మేరకు తేమ, నాణ్యతా ప్రమాణాలున్నా, ఏఈవోలు నాణ్యతను ధ్రువీకరించినా గత సీజన్‌లలో తరుగును తీసుకోవటంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ఈ సీజన్‌లో తరుగు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. నిబంధనల ప్రకారమే రైతుల నుంచి హమాలీ ఛార్జీలను వసూలు చేయాలి. ధాన్యం దిగుబడులు,



సేకరణను బట్టి గన్నీలను సకాలంలో తెప్పించాలి, చిరిగినవి, పనికిరాకుండా ఉన్న గన్నీలను కేంద్రాలకు పంపకుండా చూడాలి. కేంద్రాలకు ప్యాడీక్లీనర్లను సరఫరా చేయాలి. కేంద్రాల్లో పేరుకుపోకుండా తూకంవేసిన బస్తాల రవాణాను వెంటదివెంట చేపట్టేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

నిరుడు వానాకాలం సేకరించిన ధాన్యం: 3.78 లక్షల మెట్రిక్ టన్నులు
గత యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం: 4.21 లక్షల మెట్రిక్ టన్నులు
2022-23 వానాకాలం, యాసంగిలకు చెల్లించాల్సిన సీఎంఆర్: 5,13 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు చెల్లించిన సీఎంఆర్: 1.51 లక్షల మెట్రిక్ టన్నులు
ఇంకనూ చెల్లించాల్సిన సీఎంఆర్: 3.62 లక్షల మెట్రిక్ టన్నులు
ఈ వానాకాలంలో మొత్తం వరిసాగు: 3.06 లక్షల ఎకరాలు
కనీస దిగుబడి అంచనా: 4.0 లక్షల మెట్రిక్ టన్నులు

# ఉద్యమాల గడ్డ.. నర్సంపేట



జనగామ : : అడవులు.. ఆదివాసీ గూడేలు.. గిరిజన తండాలు.. మైదాన ప్రాంతాల కలబోతగా అవతరించిన నర్సంపేట నియోజకవర్గం సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. హైదరాబాద్ స్టేట్‌లో పాకాల నియోజకవర్గ పరిధిలో ఉండేది. 1956లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో నర్సంపేట నియోజకవర్గంగా ఏర్పడింది. 70 ఏళ్ల చరిత్ర గల ఈ ప్రాంతం ఆది నుంచి కమ్యూనిస్టుల పోరాటాల ఖిల్లాగా ఖ్యాతి పొందింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఇక్కడ 735 రోజులు నిరాటంకంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకత సంతరించుకుంది. పునర్విభజనకు ముందు చెన్నారావుపేట మండలంలోని అత్యధిక గ్రామాలు, గూడూరు మండలంలోని సగం గ్రామాలు, పూర్వపు కొత్తగూడ, నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి మండలంలో నాలుగు గ్రామాలు మినహా, ఆత్మకూరు మండలంలోని కామారం, పెంచికలపేట, ములుగు మండలంలోని పత్తిపల్లి ఈ నియోజకవర్గ పరిధిలో ఉండేవి. పునర్విభజన తర్వాత నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం, నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలు ఉన్నాయి. ఒకప్పుడు హత్యా రాజకీయాలకు ఆలవాలంగా ఉన్న ఈ నియోజకవర్గం 1994 ఎన్నికల తర్వాత రాజకీయంగా, సామాజికంగా అనేక మార్పులు చోటుచేసుకొని అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది.

పాకాల అభయారణ్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాకాల అభయారణ్యానికి ప్రత్యేకత ఉంది. 1972లో సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఈ అభయారణ్యం నెలకొల్పారు. వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలం చిలకమ్మనగర్ నుంచి ఇటు మహబూబాబాద్, అటూ ములుగు జిల్లాల వరకు 86020 హెక్టార్లలో(861 చదరపు కి.మీ.)విస్తరించి ఉన్నట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో జింకల పార్కు ఉండేది. నక్సల్స్ ప్రభావం పెరగడంతో 1995లో ఇక్కడి జింకల పార్కును హనుమకొండలోని వనవిహార్‌కు తరలించారు. అభయారణ్యంలో 145 రకాల పక్షులుండగా అడవి దున్నలు, దుప్పులు, జింకలు, లేళ్లు, కొండగొర్రెలు, ఎలుగుబంట్లు, హైనా వంటి వన్యప్రాణులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. పాకాల సరస్సులో మంచినీటి మొసళ్లు ఉన్నాయి. నిరుడు ఇక్కడి అడవుల్లో చిరుత, పులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు.

సాయుధ పోరాటం నుంచి..

పాకాల, కొత్తగూడ, నల్లబెల్లి మండలాల్లోని అటవీ ప్రాంతం కేంద్రంగా నైజాంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్‌బరి ఉద్యమాలు జరిగాయి. భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పెద్దఎత్తున భూ పోరాటాలు జరిపి పేదలకు వేలాది ఎకరాల భూములు పంచారు. గ్రామాల్లో వెట్టిచాకిరి, పాలేర్ల సమస్యలపై ఉవ్వెత్తున ఉద్యమాలు చేసి పేదల బతుకుల్లో మార్పునకు నాంది పలికిన ఘన చరిత్ర ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాకతీయుల నాటి పాకాల చెరువు(సరస్సు) కింద ఏటా 25 వేలకు పైగా ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. వరంగల్ చపాట మిర్చి సాగుకు నర్సంపేట పేరుగాంచింది. నెక్కొండలోని రైల్వేస్టేషన్ ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. విద్యా, వ్యాపారం, స్థిరాస్తి రంగాల్లో ప్రగతి సాధించింది. రైస్, బాయిల్డ్ రైస్ కలిపి మొత్తం 65 మిల్లులున్నాయి.

ఇప్పటివరకు ఎన్నికైన ఎమ్మెల్యేలు

సంవత్సరం విజేత సమీప ప్రత్యర్థి
1952(పాకాల) ఆరుట్ల గోపాల్‌రావు (పీడీఎఫ్) జమలాపురం కేశవరావు (కాంగ్రెస్)
1957 కె.కనకరత్నమ్మ (కాంగ్రెస్) అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు (పీడీఎఫ్)
1962 అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు(సీపీఐ) కాసర్ల సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్)
1967 కాసర్ల సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్) అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు(సీపీఎం)
1972 మద్దికాయల ఓంకార్ (సీపీఎం) పెండెం కట్టయ్య (కాంగ్రెస్)
1978 మద్దికాయల ఓంకార్(సీపీఎం) గంట ప్రతాప్‌రెడ్డి (కాంగ్రెస్)
1983 మద్దికాయల ఓంకార్ (స్వతంత్ర) పెండెం కట్టయ్య (కాంగ్రెస్)
1985 మద్దికాయల ఓంకార్ (స్వతంత్ర) ఎం.ఉపేందర్‌రావు (కాంగ్రెస్)
1989 మద్దికాలయ ఓంకార్ (స్వతంత్ర) ఏపూరి జనార్దన్‌రెడ్డి (కాంగ్రెస్)
1994 రేవూరి ప్రకాశ్‌రెడ్డి (తెదేపా) మద్దికాయల ఓంకార్ (ఎంసీపీఐ)
1999 రేవూరి ప్రకాశ్‌రెడ్డి (తెదేపా) దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్)
2004 కంభంపాటి లక్ష్మారెడ్డి (తెరాస) రేవూరి ప్రకాశ్‌రెడ్డి (తెదేపా)
2009 రేవూరి ప్రకాశ్‌రెడ్డి (తెదేపా) దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్)
2014 దొంతి మాధవరెడ్డి (స్వతంత్ర) పెద్ది సుదర్శన్‌రెడ్డి (తెరాస)
2018 పెద్ది సుదర్శన్‌రెడ్డి (తెరాస) దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్)

# పెరిగిన వరి దిగుబడి.. రైతన్నకు రాబడి



జనగామ : జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సాగులో వరి పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సాధారణంగా వానాకాలంలో చీడ పీడలు, తెగుళ్ల వ్యాప్తి, అధిక వర్షాలతో పంటల ఎదుగుదలలో లోపం.. తదితర కారణాలతో పంట దిగుబడి తక్కువగా ఉండేది. కానీ ఈ ఏడాది వానలు తక్కువగా కురవడం, ఉష్ణోగ్రత సాధారణం కంటే అధికంగానే ఉండటంతో వరి పంటకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో గతంలో కంటే వరి పంట ఉత్పత్తి పెరిగింది. దీంతో రైతులకు ఉపశమనం లభించింది. ప్రస్తుతం వరి కోత దశకు చేరడంతో రైతులు కోతలు చేపడుతున్నారు. చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. ఇందులో వరి 2.17 లక్షల ఎకరాలు, పత్తి 1.30 లక్షల ఎకరాలు, కంది 10 వేల ఎకరాలు, మొక్కజొన్న 12 వేల ఎకరాల్లో సాగయ్యాయి. అధిక వర్షాలతో వేరు కుళ్లు, కాండం తొలుచు పురుగు, వరి కంకులు తెల్లగా మారడం తదితర అంశాలు వరి దిగుబడిపై ప్రభావం చూపేవి. ఈ ఏడాది మాత్రం జులై చివరి నాటికే భారీగా వర్షాలు కురవడం, ఆగస్టు నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడం, నిత్యం ఉష్ణోగ్రత అవసరానికి మించి ఉండటంతో ఎలాంటి చీడ పీడలు వ్యాప్తి చెందలేదు. దీనికి తోడు ఏటా సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో వరి పంట సేకరణ దశలో వర్షాలతో కోతలు, ధాన్యం సేకరణ, ఆరబెట్టుకోవడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడేవి. ఈ సంవత్సరం వరి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో ఆశించిన దానికంటే అధికంగానే దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. పత్తి పంట దిగుబడి నిరాశ కలిగించిన నేపథ్యంలో వరి పంట రైతులకు ఊరటనిచ్చిందని చెప్పవచ్చు.

ఆశించిన మేర దిగుబడి

- ఆకుల రాజు, రైతు, గానుగుపహాడ్

జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన రైతు ఆకుల రాజు వానాకాలంలో రెండెకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడుతూ గతంలో ఎకరాకు సుమారు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, పెద్దగా చీడ పీడలు లేకపోవడంతో ఎకరాకు 20-25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందన్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

వరి పంటకు అనుకూల పరిస్థితులు

-వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జనగామ

జిల్లాలో గతంలో కంటే ఈ ఏడాది వానాకాలం సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. సాధారణ విస్తీర్ణం 1.31 లక్షల ఎకరాలు కాగా.. 2.17 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ మేరకు 4.57 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశాం. స్థానిక అవసరాలు, విత్తనాలు, ప్రైవేటు అమ్మకాలకు పోను మిగతా 2.32 లక్షల మె.ట. ధాన్యం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు వస్తుందని అంచనా. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

వివరాలు.. పంట సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
సీజన్: వానాకాలం-2023
పంట : వరిసాధారణ విస్తీర్ణం: 1.31
సాగు చేసింది : 2.17
రానున్న దిగుబడి : 4.57 లక్షల మె.ట.
కొనుగోలు కేంద్రాల సేకరణ లక్ష్యం: 2.30 లక్షల మె.ట.

# జాతీయ విద్యా సర్వేకు సిద్ధం..!

మానుకోట : దేశవ్యాప్తంగా నవంబర్ 3న జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ), 'పరఖ్' ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సాధన సర్వే (సీస్)-2023కు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మకమైన సర్వేను సజావుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.. దేశంలోని విద్యారంగ పరిస్థితిని, ఆయా తరగతుల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలను తెలుసుకునే లక్ష్యంతో ఈ సర్వేను నిర్వహించనున్నారు. ఈ జాతీయ సర్వేపై జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు జూమ్ వేదికగా ఇప్పటికే అవగాహన కల్పించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ సర్వే పరీక్షల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ముందుగా ఆరు మాదిరి పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ పంపిణీ చేసిన విద్యాసామగ్రితో కొన్ని మాదిరి పరీక్షలను నిర్వహించారు. ప్రతి



పరీక్ష అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు సమీక్ష చేస్తున్నారు. చివరి మాదిరి పరీక్ష నవంబర్ 2న జరగనుంది. ఆ మరుసటి రోజే సీస్ నిర్వహించే పరీక్షకు సంబంధించి మండల సమన్వయకర్తలకు తాజాగా జూమ్ వేదికగా శిక్షణ ఇచ్చారు. 588 మంది ఫీల్డ్ ఇన్‌వెస్టిగేటర్లను 28 మంది బ్లాక్‌స్థాయి సమన్వయకర్తలను ఎంపిక చేశారు. 350 పాఠశాలల్లో..: సీస్ పరీక్షలను జిల్లాలో ఎంపిక చేసిన అన్ని యాజమాన్యాలకు చెందిన 350 పాఠశాలల్లో 3,6,9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఆయా తరగతులకు ఇలా..: మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు భాషలు, గణితం విషయాల్లో పరీక్షను నిర్వహిస్తారు.

# దొంగ ఓట్ల కట్టడిపై నజర్

జగిత్యాల : ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ, పరిశీలన ముమ్మరంగా చేపడుతోంది. స్థానికంగా లేనివారు, మృతుల పేర్లను వెంటనే జాబితాలో నుంచి తొలగించాలని ఇప్పటికే బూత్ లెవల్ అఫీసర్ (బీఎల్‌వో)లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి కరీంన గర్ జిల్లావ్యాప్తంగా చాలా మంది ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి ఉపాధి కోసం అక్కడే ఉండటం, కాలానుగుణంగా రాకపోకలు సాగిస్తుం డటం చేస్తున్నారు. ఎన్నికల వేళ వ్యయప్రయాసలకు భయపడి వీరు రావడం లేదు. దీంతో వారి ఓట్లు కూడా కొందరు అక్రమార్కులు వేస్తున్నారు. గతంలో దొంగ ఓట్లు నమోదైన ఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గత సెప్టెంబర్‌లో విడుదల చేసిన రెండో ప్రత్యేక సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్)లో మృతిచెందిన ఓటర్ల పేర్లు కొన్ని అలాగే ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. నవంబర్ 10లోగా ఈ జాబితా మారుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి అన్నీ పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా జాబితాను పంపిస్తామని చెబుతున్నారు.

ఉపాధి బాటలో వలస దేశాలకు..ఉమ్మడి జిల్లా పరిధిలో 13 నియోజకవర్గాలుండగా మొత్తం 31,12,283 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 15,27,600 మంది, మహిళలు 15,84,500, ఇతరులు 183 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి ఆయా దేశాలకు ఎక్కువ సంఖ్యలో వలస వెళ్లారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59,615 మంది పేర్లను తొలగించాల్సి ఉంది. 84,156 మంది తమ పేర్లను మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల వారీగా చూస్తే కనీసం ఒక్కో నియోజకవర్గానికో 500 మంది మృతిచెందిన వారు, వలసలు, చిరునామాలలో లేనివారు వేలల్లో ఉంటారని, బీఎల్‌వోల క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైనట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరి జాబితాను త్వరలో ఆయా పోలింగ్ కేంద్రాల్లో నిక్షిప్తం చేయనున్నారు. ఎవరైనా ఈ జాబితాలో ఉన్న పేరుతో ఓటేసేందుకు వస్తే వారిని గుర్తించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నారు.

మరణ ధ్రువీకరణ పత్రాలు లేక..

వలస ఓటర్లు, మృతులు, చిరునామాలు మార్చిన వారిని ఓటరు జాబితాల నుంచి సంపూర్ణంగా తొలగించలేదు. వీరి స్థానంలో ఇతరులు వచ్చి దొంగ ఓటు వేయకుండా ఎన్నికల అధికారులు ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్)



జాబితాను తయారు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలో పేరుండి స్థానికంగా లేని వారు, మృతిచెందిన వారు, ఆ ఇంటి చిరునామాలో లేనివారిని గుర్తించి జాబితాను రూపొందిస్తున్నారు. ఈ జాబితాను పోలింగ్ కేంద్రం అధికారికి అందిస్తారు. జాబితాలో పేరున్న వారు ఓటేసేందుకు వస్తే ప్రత్యేకంగా పరిశీలిస్తారు. గుర్తింపు కార్డులు ఉంటేనే అనుమతిస్తారు. జాబితాలో పేరున్న వ్యక్తికి బదులు ఇంకొకరు పోలింగ్ కేంద్రానికి వస్తే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తారు. బీఎల్‌వోలు చనిపోయిన వారిని జాబితాలో నుంచి టిక్ పెట్టి తొలగించినప్పటికీ.. రెవెన్యూ అధికారులు మాత్రం మరణ ధ్రువీకరణ పత్రాలు సదరు కుటుంబ సభ్యులు సమర్పిస్తేనే జాబితాలో తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పత్రాలు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించడానికి ప్రధాన కారణం ఇదేనని బీఎల్‌వోలు చెబుతున్నారు.

నవంబరు 10లోపు జాబితాఇప్పటికే రెండు దఫాలుగా మృతులు, వలసదారులు, చిరునామా మార్పిడి చేసుకున్న, డబుల్ ఎంట్రీలున్న వారివి ఆయా బీఎల్‌వోలతో తొలగించాం. మరోసారి సమగ్ర పరిశీలన చేపడతాం. నవంబరు 10లోపు ఇలాంటి వారిని గుర్తించి ఏఎస్‌డీ జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తాం.ప్రవీణ్, జిల్లా ఎలక్షన్ డీటీ, పెద్దపల్లి

# పుంజుకుంటున్న బొగ్గు ఉత్పత్తి

కోల్‌బెల్ట్: భూపాలపల్లి సింగరేణి ఏరియాలో ఏప్రిల్‌లో కొంతమేర బొగ్గు ఉత్పత్తి పుంజుకుంది. గత వార్షిక ఉత్పత్తి కేవలం 57 శాతం మాత్రమే సాధించింది. ఈ నేపథ్యంలో 2023-24వ ఆర్థిక సంవత్సరంలో కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతుండడంతో రోజురోజుకు వెలికితీత పెరుగుతోంది. ఏరియాకు బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.88 లక్షల టన్నులు ఉండగా 2.64 లక్షల టన్నులు సాధించి 68 శాతంతో నిలిచింది. సింగరేణి ప్రధాన వినియోగదారులు ఎన్టీపీసీ, జెన్‌కో, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు సంస్థలకు సరిపడా బొగ్గును అందించడంలో ఎక్కడా వైఫల్యం కాకూడదని ఏర్పాట్లు చేసుకుంటోంది. విద్యుత్తు సంస్థలు అందుబాటులో ఉన్న సింగరేణి వైపే మొగ్గు చూపుతూ బొగ్గు తీసుకొని నిల్వలు పెంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతో సింగరేణి ఎక్కడా లోపం ఉండకుండా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. రైల్వే వ్యాగన్లు అందుబాటులో ఉండాలని ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. ఏరియా నుంచి రోజూ 3.88 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయాలనే ఆలోచన చేస్తోంది.లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళిక భూపాలపల్లి ఏరియా బొగ్గు ఉత్పత్తిలో మెరుగుపడుతోంది. నిర్దేశించిన రోజువారీ లక్ష్యం 8,822 టన్నులను అధిగమించేందుకు కొత్త ప్రణాళికలు



రూపొందించుకుంది. ఈ వార్షిక సంవత్సరంలోనైనా లక్ష్యాన్ని అధిగమించాలనే ప్రయత్నంతో ముందుకుసాగుతోంది. ఇంకా 11 నెలలు మిగిలి ఉన్నా ఇప్పటి నుంచే వేగవంతంగా కసరత్తు మొదలుపెట్టింది. భూగర్భ బొగ్గు బావుల్లో ఉత్పత్తి పెంచుకోవడానికి తరచూ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. ముఖ్యంగా ఉపరితల గనుల్లో మట్టి వెలికితీత లక్ష్యాన్ని ఛేదించాలని, గుత్తేదారులను ఆదేశించింది. కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టింది. కౌన్సెలింగ్ ఇస్తూ విధులకు హాజరయ్యేలా చూస్తోంది. భూగర్భ గనుల్లోని ఎస్‌డీఎల్ యంత్రాల పనితీరును మెరుగుపర్చేందుకు దృష్టి సారించింది. యంత్రాల పని గంటల పెంపునకు ఆలోచన చేసింది. పరికరాల కొరత లేకుండా సరఫరా అందుబాటులో ఉంచుతోంది.

# మరో 150 సీట్ల కేటాయింపు

జగిత్యాల : జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని సదుపాయాలున్న నేపథ్యంలో జాతీయ వైద్య మండలి రెండో సంవత్సరానికి మరో 150 సీట్లు కేటాయించింది. గతేడాది 150 సీట్లు కేటాయించగా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ అయిన విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యనభ్యసిస్తుండగా వచ్చే ఆగస్టులో మరో 150 సీట్లు ర్యాంకు ఆధారంగా భర్తీ కానున్నాయి. కళాశాలలో విద్యార్థులకవసరమైన తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ తదితర అన్ని సదుపాయాలుండటమే కాకుండా బోధన, బోధనేతర సిబ్బంది సమస్య లేదు. ప్రస్తుతం 86 మంది బోధన, 66 మంది బోధనేతర, 140 మంది ఇతర సిబ్బంది ఉండగా ఈ సంవత్సరం పదోన్నతుల ద్వారా కొందరు, నేరుగా నియమితులైన వారు కొందరు రానున్నారు. మొదటి బ్యాచ్ పూర్తయ్యే వరకు కళాశాలకు 1001 మంది బోధన, బోధనేతర సిబ్బంది పూర్తిస్థాయిలో రానున్నారు. కాగా విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచి గ్రామాల్లో కుటుంబాల దత్తత ఇవ్వనున్నారు. ఒక్కో విద్యార్థికి అయిదేసి చొప్పున కుటుంబాలను దత్తత ఇచ్చి అయిదేళ్ల వరకు వైద్య సేవలందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. వైద్య కళాశాల




కోసం తాత్కాలిక భవనాలలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించి నిర్వహిస్తునప్పటికి రూ.150 కోట్లతో కొత్త నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయి.

రాష్ట్రంలోనే మొదటిది..డేవిడ్ ఆనంద్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్

జగిత్యాల వైద్య కళాశాలకు రెండో సంవత్సరానికి జాతీయ వైద్య మండలి అనుమతించింది. రాష్ట్రంలోనే కేవలం జగిత్యాల కళాశాలకు మొదట అనుమతివ్వటం సంతోషంగా ఉంది. పేద విద్యార్థులకు వైద్య విద్య దగ్గర కావాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయం గొప్పది. కళాశాల ప్రిన్సిపల్ శివరాం ప్రసాద్ శ్రద్ధతో రాష్ట్రంలోనే జగిత్యాల కళాశాలకు మంచి పేరు వస్తోంది.

అన్ని సదుపాయాలు.. జాకబ్ నవీన్, విద్యార్థి(వరంగల్)

జగిత్యాల వైద్య కళాశాలలో అన్ని సదుపాయాలున్నాయి. జగిత్యాల కళాశాలలో సీటు లభించటం అదృష్టంగా భావిస్తున్నాను. తరగతి గదులు, ల్యాబ్, సిబ్బంది సమస్య లేదు.

బోధన బాగుందిమేఘన, విద్యార్థిని(హైదరాబాద్)

జగిత్యాల కళాశాలలో బోధన బాగుంది. తరగతుల నిర్వహణ, ల్యాబ్, ప్రాక్టికల్స్ అన్ని క్రమబద్ధంగా సాగుతున్నాయి. మంచి వైద్యురాలిగా స్థిరపడాలన్నదే నా ఆశయం.

ప్రైవేటుకు దీటుగా..భవ్య, విద్యార్థిని(సిద్దిపేట)జగిత్యాల వైద్య కళాశాల ప్రైవేటు వైద్య కళాశాలకు దీటుగా ఉంది. అన్ని సౌకర్యాలతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది సేవలు మెరుగ్గా ఉన్నాయి. రెండో సంవత్సరానికి అనుమతి లభించటం ఆనందంగా ఉంది.

# పాఠకులకు నిత్యం పరీక్షే..



మహబూబాబాద్ : గ్రంథాలయాలు.. ఎందరో ఉన్నతంగా స్థిరపడటానికి చక్కటి వేదికలు.. ఉద్యోగ నోటిఫికేషన్లు, వేసవి సెలవులు కావడంతో గ్రంథాలయాలకు పాఠకులు, యువకులు ఎక్కువగా వస్తున్నారు. అలాంటిది సదుపాయాలు లేక సమస్యల ఒడిలో కొనసాగుతున్నాయి. నగరంలోని మట్టెవాడలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయంలో సదుపాయాలు కరవయ్యాయి. ఎలాంటి అభివృద్ధి పనులు, సదుపాయాలను కల్పించకుండానే దీన్ని జిల్లాస్థాయి గ్రంథాలయంగా మార్చారు. తగినన్ని పుస్తకాలు అందుబాటులో లేవు. వార్తాపత్రికలు చదివే వారితోనే గ్రంథాలయం నిండిపోతుంది.

ఇక్కడ రెండే రోజులు..

గ్రంథాలయంలో విధులు నిర్వర్తించే గ్రంథపాలకులు మరో రెండు జిల్లాల్లో విధులను కేటాయించడంతో మంగళవారం, గురువారాల్లో మాత్రమే గ్రంథాలయంలో ఆమె అందుబాటులో ఉంటున్నారు. ఆ సమయంలో మాత్రమే పుస్తకాలను భద్రపరిచే గది తెరుస్తారు. మిగిలిన రోజుల్లో తాళం వేసి ఉంచడంతో ప్రాచీన సాహిత్యం, ఇతర రిఫరెన్స్ పుస్తకాల కోసం గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు నిరాశే మిగులుతోంది. పోటీపరీక్షలకు హాజరయ్యేవారు స్వతహాగా కొనుగోలు చేసిన పుస్తకాలను వెంటతెచ్చుకుని ఇక్కడ చదువుకుంటున్నారు. గ్రంథాలయంలో సిబ్బంది కొరత ఉండడంతో ఏవైనా పుస్తకాలు దొంగిలిస్తే తమ వేతనాల్లో కోత విధిస్తారనే పుస్తకాలను భద్రపరిచే గదికి తాళం వేసినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.

స్థలం, సిబ్బంది కొరత..

భవనం పక్కనే ఉన్న రెండు గదుల్లో ఒకదాంట్లో పుస్తకాలను భద్రపర్చగా.. మరొకటి గ్రంథాలయ ఛైర్మన్, కార్యదర్శుల కోసం పార్టిషన్ ద్వారా రెండు చిన్న గదులుగా మార్చారు. 6 నెలల కిందట అదనపు గదుల నిర్మాణానికి రూ.17.5 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా.. కొన్నాళ్ల కిందట ఛైర్మన్ మృతిచెందడంతో నిర్మాణ ప్రతిపాదనలు అటకెక్కాయి. ఇక్కడ పనిచేసే గ్రేడ్ 1 గ్రంథపాలకులు శ్రీలత మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల గ్రంథాలయాలకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఉద్యోగి మినహా, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో దీన్ని నిర్వహిస్తున్నారు.

పేరుకే స్మార్ట్ లైబ్రరీ..

'పైన పటారం లోన లోటారమన్నట్లుగా ఉంది హనుమకొండ జిల్లా రంగంపేట ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం తీరు. స్మార్ట్‌సిటీ పథకం ద్వారా సుమారు రూ.2.78 కోట్లతో స్మార్ట్ లైబ్రరీ అభివృద్ధి పనులు చేపట్టారు. దీని వెనుక భాగంలో చూస్తే మురుగునీటి కూపంతో పాఠకులు నానా అవస్థలు పడుతున్నారు. టాయిలెటు సెప్టిక్ ట్యాంకు లీకేజీ నీరు ఖాళీ స్థలాన్ని ముంచెత్తింది. దుర్వాసన, దోమల సమస్యలు ఎక్కువైంది. వాహనాలు నిలిపే స్థలం మురికి కూపంలా తయారైంది. గ్రంథాలయానికి రోజూ 300-400 మంది పాఠకులు వస్తారు. వేసవి సెలవులుండటంతో 100 మంది పిల్లలు వస్తున్నారు. కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేవు. వాష్ రూంలు సరిపోవడం లేదు. బయట టాయిలెటు బ్లాకు ఏర్పాటు చేయాలి. సరైన పుస్తకాలు అందుబాటులో లేవు.

కార్టూన్, కథల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి- గద్వాల సమ్మయ్య, రామన్నపేట

పదేళ్ల నుంచి గ్రంథాలయానికి వస్తున్నాను. జిల్లా గ్రంథాలయంగా మారినా గతంలో మాదిరిగానే నిర్వహణ ఉంది. వార్తాపత్రికలు మినహా వార, మాసపత్రికలు రావడంలేదు. వేసవికాలంలో చిన్నారులు టీవీలు, మొబైల్స్‌కు అతుక్కుపోకుండా ఉండేందుకు గ్రంథాలయంలో వారిని ఆకర్షించే విధంగా కార్టూన్, కథల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి.

సరిపడా కుర్చీలు లేవు-పెండ్యాల రాజ్‌కుమార్, కాశీబుగ్గ

గ్రంథాలయానికి పాఠకుల రాక పెరిగింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి సరిపడా కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పురుషులకు ఒక్కటే వాష్ రూం ఉంది. బయట టాయిలెటు బ్లాకు ఏర్పాటు చేయాలి. భవనం వెనుక ఖాళీ స్థలం మురికి కూపంలా మారింది. దీంతో వాహనాలు రోడ్డు మీదే పార్కింగ్ చేస్తున్నాం.

పుస్తకాలు అందుబాటులో లేవు- ఎండీ.విలాయాత్ ఆలీ, చార్‌బౌళి వరంగల్

పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు లేవు. తాజా కరెంటు అఫైర్స్, ఇతర తాజా సమాచారం పుస్తకాలు కావాలి. నేను గ్రూపు-1 పోటీ పరీక్షకు సిద్ధమవుతున్నా. వసతులు ఫర్వాలేదు.

కమిషనర్‌కు లేఖ రాశాం- అలివేలు మంగతయారు, గ్రంథపాలకురాలు

గ్రంథాలయం భవనం వెనుక ఖాళీ స్థలంలో నీరు నిలిచింది. గత నెలలో రూ.3 వేలు ఖర్చు చేసి శుభ్రం చేయించాను. టాయిలెటు బ్లాకు నుంచి లీకేజీ ఏర్పడింది. దుర్వాసన, దోమల సమస్యలున్నాయి. గ్రేటర్ వరంగల్ కమిషనర్‌కు లేఖ రాశాం. అధికారులు పట్టించుకోవడం లేదు.

# సమయంలోపు పనులు సవాలే..!

మహబూబాబాద్ : మేడారం మహాజాతర.. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర.. కోటికి పైగా భక్తులు తరలివచ్చే తెలంగాణ కుంభమేళా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21, 22, 23, 24 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు పూజారులు ప్రకటించారు. మహాజాతరకు సరిగ్గా 9 నెలల పైగా సమయం ఉంది. జాతర అభివృద్ధి, ఏర్పాట్లకు ప్రతిసారీ సమయం సరిపోవడం లేదు. నిధుల విడుదలలో జాప్యం వల్ల ఆలస్యమవుతోంది. ఈసారైనా గడువులోపు పనులు పూర్తి చేయాలంటే ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం ముందుకు కదలాల్సి ఉంది. వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి కార్యాచరణ ప్రారంభించాలి.


పోలీస్ స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలి..

మేడారంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలి. నిత్యం భక్తులు వస్తున్నారు. ఇక్కడ ఘర్షణలు, దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల అక్కడ పూజారి హత్యకు గురయ్యాడు. ఇప్పటికీ నిందితుడు దొరకలేదు. ఠాణా వినియోగంలోకి వస్తే భక్తులకు భద్రత ఉంటుంది.

శాశ్వత ప్రాతిపదికన..తాగునీరు, మరుగుదొడ్లు తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. కాని జాతర సమయంలో వినియోగం అంతంతే. ప్రతిసారీ ఎక్కువ మొత్తంలో వీటికే కేటాయిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నాణ్యతతో కూడినపనులు చేపట్టి భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలి.

ఇలా చేద్దాం..

జాతర సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. తాడ్వాయి-మేడారం, పస్రా-మేడారం, కాటారం-మేడారం, భూపాలపల్లి-మేడారం రహదారులు ఫోర్‌లైన్‌గా విస్తరించే రాకపోకలు అదే దారిలో కొనసాగించవచ్చు. ఇప్పుడున్న వన్‌వేతో భక్తులకు దూరభారం తగ్గుతుంది. ప్రమాదాలు నివారించవచ్చు. జంపన్న వాగుపై ఊరట్టం లోలెవల్ కాజ్‌వే వద్ద, రెడ్డిగూడెం ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాలి. దీని వల్ల రద్దీని నియంత్రించవచ్చు. మేడారంలో అంతర్గత రహదారులు సక్రమంగా లేవు. రెడ్డిగూడెం, హరితహోటల్, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు, సమ్మక్క గుడి తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు విస్తరించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి. దీనివల్ల భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ట్రాఫిక్ ఆంక్షలతో భక్తులను సుదూర ప్రాంతాల్లోనే నిలిపివేస్తున్నారు. అమ్మవారికి సమర్పించే బంగారం, పిల్లలతో కలిసి గద్దెల వద్దకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. జాతర పరిసరాల్లో స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. గద్దెల పరిసర ప్రాంతాల్లో భక్తులు విడిది చేసేలా



చర్యలు చేపట్టాలి. విరివిగా కాటేజీలు నిర్మించి వచ్చే జాతర కల్లా అందుబాటులో తీసుకురావాలి. ఆలయ పరిసరాల్లో దాదాపు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు లేకుండా, భక్తులు ప్రశాంతంగా కాసేపు సేదతీరేలా ఏర్పాట్లు చేయాలి.

ప్రభుత్వం చొరవ చూపాలి- జగ్గారావు, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వం చొరవ తీసుకుని పనుల ప్రారంభానికి ప్రణాళిక రూపొందించాలి. పరిసరాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి. నిధులు త్వరగా మంజూరు చేసి పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలి. పూజారులకు విడిది గృహం నిర్మించాలి. జాతరను మరింత అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం- కృష్ణ ఆదిత్య, పాలనాధికారి, ములుగు జిల్లా


జాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనుల నిమిత్తం వారం రోజుల కింద అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాం. పూజారుల అభిప్రాయాలను కూడా తీసుకున్నాం. ఐదు ఇంజినీరింగ్ విభాగాలతో పాటు మరో 16 విభాగాల అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయమని ఆదేశాలు ఇచ్చాం. శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన రెండు విభాగాలు విభజించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

# తాగునీటికి తండ్లాటే!

కరీంనగర్ : 'పేదరిక సమస్య పూర్తిగా సమసిపోలేదు.. పక్కా ఇళ్ల రూపంలో సొంతింటి కల అందరికీ దరిచేరలేదు.. పౌష్టికాహారం విషయంలోనూ ఇంకా పాత సమస్యలే ఇబ్బంది పెడుతున్నాయి. పల్లె బడుల్లో విద్యార్థుల నమోదు పెరగడం లేదు. ఊరూవాడల్లో పారిశుద్ధ్యం ఇక్కట్లు పూర్తిగా తొలగలేదు'. ఇదీ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పరిస్థితి. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన బహుముఖ పేదరిక సూచిక (మల్టీ డైమెన్షనల్ పావర్టీ) నివేదికలో వెల్లడించిన విషయాలు ఇక్కడి జనజీవన స్థితిని కళ్లకు కడుతున్నాయి. రాష్ట్ర సగటు కన్నా చాలా విషయాల్లో ఉమ్మడి కరీంనగర్ మెరుగ్గానే ఉన్నప్పటికీ.. మారుతున్న పరిస్థితులు, దరిచేరుతున్న అభివృద్ధి పరంగా మరింత పురోగతి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ ఫలాల్ని కొత్త పథకాల్ని దగ్గర చేస్తున్నప్పటికీ ఇంకా పూర్తిస్థాయి ప్రగతి జనాలకు దగ్గరవ్వలేదు.

మూడో స్థానంలో మనం..!

పేదరికం కాస్త తక్కువగా ఉన్న జాబితాల వరుసలో రాష్ట్రంలో కరీంనగర్ పై నుంచి మూడో స్థానంలో ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మన ముందు ఉన్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో గడిచిన అయిదారేళ్లలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లతోపాటు మరో 14 పురపాలికలు ఉ



ండటంతో పట్టణీకరణ ప్రాధాన్యత జీవనశైలి పరంగా ఇంతకింతకు పెరుగుతోంది. అందివస్తున్న అవకాశాలతో ఆర్థికంగా బలోపేతమవుతున్న కుటుంబాల సంఖ్య వృద్ధి చెందుతోంది.

మిషన్ భగీరథ ద్వారా నీరు అందిస్తున్నా ఇంకా 35.83 శాతం మందికి పక్కా కనెక్షన్ల ద్వారా నీరు అందడం లేదని నివేదిక తేల్చింది. రాష్ట్రంలో 27.81 శాతం మందికి తాగునీరు అందని పరిస్థితి ఉండగా ఉమ్మడి జిల్లాలో ఆ శాతం ఎక్కువగా ఉంది. గ్రామాల్లో (33.91 శాతం) కన్నా పట్టణాల్లో (39.45 శాతం) తాగునీరు అందనివారు ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఆరోగ్యం, విద్య, జీవన విధానం..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) గతంలో నిర్వహించిన మూలాల ఆధారంగా ఈ నివేదికను పొందుపర్చారు. ఇందులో ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, జీవన విధానం అనే మూడు విషయాలను పరిగణలోకి తీసుకున్నారు. పేదరిక నిర్మూలనకు ప్రధానమైన వాటిలో ఈ మూడింటిలో మంచి మార్పు కీలకం. ఆరోగ్యం పరంగా పౌష్టికాహార లోపం, శిశు కౌమార మరణాలు, తల్లి ఆరోగ్యంపై దృష్టి పెట్టారు. విద్యాపరంగా పల్లె, పట్టణాల్లో బడులకు విద్యార్థుల నమోదు, వారి హాజరు శాతానికి ప్రాధాన్యమిచ్చారు. ఇక జీవన విధానం పరిధిలో వంట ఇంధనం వాడకం మొదలు ఇంటి ఆవరణ, చుట్టుపక్కల పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, పక్కా ఇళ్లు, ఆస్తులు, బ్యాంకు ఖాతాల రూపంలో ఏడు అంశాలపై సమగ్రమైన విధానాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని నివేదికలో పొందుపర్చారు.

గూడు దొరకాలి

పక్కా ఇళ్లు లేకపోవడం విషయంలో ఉమ్మడి జిల్లా రాష్ట్ర సగటుకు సమీపంలో ఉంది. రాష్ట్రంలో 25.53 శాతానికి ఇళ్లు లేవని నివేదికగా తేల్చగా ఉమ్మడి జిల్లాలో ఆ శాతం 24.58గా ఉంది. ఇందులోనూ గ్రామాల్లో 31.52 శాతం మందికి పక్కా ఇళ్లు లేవని తేలగా, పట్టణాల్లో 11.45 శాతం మందిది ఇదే పరిస్థితి.

# అధ్వానంగా పుర వీధులు

జగిత్యాల :మెట్‌పల్లి బల్దియా పరిధిలోని వీధుల్లో నడవాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో వీధులన్నీ ధ్వంసమై అధ్వానంగా తయారయ్యాయి. పెద్దపెద్ద గుంతలతో కంకరరాళ్లు తేలి చిన్నపాటి వర్షానికే నీరంతా నిల్వ ఉంటుంది. పైపులైన్ల లీకేజీలతో మరమ్మతుల కోసం గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి.

టినిల్వలతో ఇబ్బందులు..

పట్టణంలోని వెల్లుల్ల రోడ్డు నుంచి ఎస్సారెస్పీ కెనాల్ నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డుకు నీటి కష్టాలు



తప్పడం లేదు. చాలా చోట్ల ఇలాంటి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డు గుండా ప్రజలు రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నారు. రోడ్డుపై నీటి నిల్వలతో ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. జాతీయ రహదారి నుంచి ఆదర్శనగర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. ఎటూ చూసిన గుంతలు, కంకరరాళ్లతో దర్శనమిస్తుంది. ఈరోడ్డుపై వెళ్లే వారు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని బోయవాడలోని రహదారి పూర్తిగా ధ్వంసమైంది. చినుకుపడితే చాలు వర్షం నీరంతా రహదారిపై రోజుల తరబడి నిల్వ ఉండడంతో ప్రజల రాకపోకలకు సమస్యగా మారింది. పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో కూరగాయల మార్కెట్ ఉండడంతో భగీరథ పైపులైన్ లీకేజీ అయినా, చిన్నపాటి వర్షం పడినా రైతులు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

# జర్నలిస్టులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్

అమరావతి: జర్నలిస్టులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ అందించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి జర్నలిస్ట్‌కు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టున్నారు. ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు.. రూ. 19 వేల కోట్ల పెట్టుబడుల పరిశ్రమల ఏర్పాటు, సమగ్ర కుల గణన, ఏపీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ తదితర అంశాలపై చర్చించిన కేబినెట్ అందుకుఆమోద ముద్ర వేసింది.

కులగణనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. అణగారిన వర్గాల అభ్యున్నతికి కులగణన మరింత ఉపయోగపడుతుందని సీఎం జగన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే సమయంలో జ.గనన్న సురక్ష కార్యక్రమానికి కేబినెట్ అభినందనలు తెలిపింది. ఈ మేరకు సీఎం జగన్ మాట్లాడుతూ.. మంత్రులందరూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ఆదేశించారు.



# పట్టిసీమ.. ఒక నాయకుడి విజన్.. ఆలోచన.. ఆచరణ: దేవినేని ఉమ

పట్టిసీమ: ఒక నాయకుడి విజన్.. ఆలోచన.. ఆచరణకు పట్టిసీమ ప్రాజెక్టు నిదర్శనమని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ అన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు జాతి సంపదను సృష్టించారన్నారు. నదుల అనుసంధానంపై జగన్ ఏనాడైనా మాట్లాడారా?అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం పట్టిసీమ ప్రాజెక్టును సందర్శించి, గోదారి తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచేశారు. పట్టిసీమ ద్వారా కృష్ణమ్మను గోదావరి తల్లిని పవిత్ర సంగమంలో కలిపిన ఒక మహా నాయకుడిని రాజమహేంద్రవరం జైల్లో పెట్టారు. వైకాపా నేతలు ఎప్పుడైనా పట్టిసీమ నేలను చూశారా? విశాఖలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ' జరుగుతోంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 5కోట్లు ఖర్చు పెడుతోంది. కానీ, కాన్ఫరెన్స్ గురించి సీఎం ఐదు నిమిషాలు కూడా మాట్లాడలేదు. బాబాయి హత్య కేసులో తమ్ముడు ఎంపీ అవినాష్ రెడ్డిని కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 440 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే ఈ సీఎం 110 మండలాలే అని చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాపై కేసులు పెడుతున్నారు" అని దేవినేని మండిపడ్డారు.

**రైతులెవరూ సంతోషంగా లేరు: ప్రత్తిపాటి** – కనీసం ఈ ఆరు నెలలైనా సీఎం జగన్ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని పార్టీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సాగు సంక్షోభం, రైతుల ఇబ్బందులపై దృష్టి సారించాలన్నారు. "రైతుల ఆత్మహత్యల్లో ఇప్పటికే ఏపీ మూడో స్థానంలో ఉంది. ఉన్న కష్టాలు చాలవన్నట్లు రాష్ట్రంలో కరవు ఉరుముతోంది. వైకాపా పాలనలో ఒక్క రైతు అయినా సంతోషంగా ఉన్నాడా?ఎండిన పంట చేలల్లోకి వెళ్లి చూస్తే రైతుల కష్టాలు కనిపిస్తాయి" అని ప్రత్తిపాటి అన్నారు.

# జగన్ జమానాలో దళితుల అణచివేతకు ఇది పరాకాష్ఠ: లోకేశ్



అమరావతి: సీఎం జగన్ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతో మంది దళితబిడ్డలు బలికాగా.. తాజాగా మరో దారుణం చోటుచేసుకుందని మండిపడ్డారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్‌కుమార్‌ను కొందరు దుండగులు నిర్బంధించారన్నారు.

4 గంటలపాటు చిత్రహింసలు పెట్టడమే కాకుండా దాహం వేసి మంచినీళ్లు అడిగితే సభ్యసమాజం తలదించుకునేలా మూత్రం పోసి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఏమాత్రం మనస్సాక్షి ఉన్నా.. ఈ అమానవీయ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకేశ్ డిమాండ్ చేశారు. బాధిత దళితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటైన చట్టబద్ధ సంస్థకు అధిపతి అయిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ బాబు ఈ ప్రభుత్వంలో నేనే బాధితుడ్ని అని వాపోవడం... జగన్ జమానాలో దళితులపై అణచివేత చర్యలకు పరాకాష్ఠ అని ఆయన దుయ్యబట్టారు.

# తాత్కాలిక ప్రలోభాలకు లోనైతే.. ఐదేళ్లు ఇబ్బందే: వెంకయ్య



తిరుమల: తిరుమల శ్రీవారి ఆదాయాన్ని ధార్మిక పరిరక్షణకు వినియోగించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు వెచ్చించాలని సూచించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమల చేరుకున్న ఆయన.. రేణిగుంట విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. నీతిగా, నిజాయతీగా ఉన్నవారిని ఎన్నికల్లో గెలిపించుకోవాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిని ఎన్నుకోవద్దని కోరారు. కులం, ధనం కాకుండా వ్యక్తి గుణానికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

తాత్కాలిక ప్రలోభాలకు లోనైతే ఐదేళ్లు ఇబ్బంది పడాల్సి వస్తుందని వెంకయ్య హెచ్చరించారు.

# నా భర్తను వైకాపా ఎమ్మెల్యే బావమరిదే చంపాడు: తెదేపా నేత నందం సుబ్బయ్య భార్య



ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తెదేపా నేత నందం సుబ్బయ్య హత్యపై ఆయన భార్య అపరాజిత కీలక వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం తన భర్త నందం సుబ్బయ్యను స్థానిక వైకాపా ఎమ్మెల్యే బావమరిది బంగారుముని రెడ్డి హత్య చేశారని ఆమె ఆరోపించారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో అపరాజిత మాట్లాడారు. ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి ప్రోత్సాహంతోనే సుబ్బయ్యను బంగారు మునిరెడ్డి దారుణంగా హతమార్చాడన్నారు. వారు చేసే దందాలు, భూ కబ్జాలు బయట పెడతారనే భయంతోనే తన భర్తను చంపేశారని ఆరోపించారు. తన భర్తను చంపిన వాళ్ళు జైల్లో ఉండాలని ప్రతిరోజూ ప్రార్థిస్తున్నానని అపరాజిత తెలిపారు. ఈ హత్య కేసులో నిందితుడిగా ఉన్న బెనర్జీ.. వైకాపా నేతలతో ఎందుకు తిరుగుతున్నాడని ఆమె ప్రశ్నించారు.

నందం సుబ్బయ్యను చంపినట్టే చంపుతామని పలువురిని బెనర్జీ బెదిరించారని ఆరోపించారు. ఇటీవల ప్రొద్దుటూరులో బెనర్జీపై దాడి జరిగితే ఆ ఘటనతో సంబంధం లేని తెదేపా నేత ప్రవీణ్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి వస్తుందని చెప్పారు. తన భర్తను చంపిన వాళ్లు జైలుకి వెళ్లడం ఖాయమన్నారు.



# గాజాపై అమెరికా డ్రోన్లు..!

హమాస్ అపహరించిన బందీల జాడ తెలుసుకునేందుకు అమెరికా డ్రోన్లు రంగంలోకి దిగాయి. తాజాగా గాజా గగనతలంలో అమెరికా నిఘా డ్రోన్లు చక్కర్లు కొడుతున్నాయి. బందీలను దాచిన ప్రదేశాలకు సంబంధించిన ఇంటెలిజెన్స్‌ను సేకరిస్తున్నాయి. దాదాపు వారం క్రితం నుంచే ఇవి గాలింపు చేపట్టాయని ఇజ్రాయెల్ అధికారి ఒకరు వెల్లడించారు. పదుల సంఖ్యలో అమెరికన్లు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. ఇజ్రాయెల్‌కు తమ దేశాన్ని రక్షించుకునే హక్కుందని జోబైడెన్ పేర్కొన్నారు. ఆయన వాషింగ్టన్‌లో చిలీ, డోమినికన్ రిపబ్లిక్ నాయకులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తనను తాను రక్షించుకొనేందుకు ఇజ్రాయెల్ చేసే ప్రయత్నాలకు అమెరికా మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో గాజాలోని ప్రజలకు మానవతా సాయం అందిస్తామని అమెరికా పేర్కొంది. ఈ సమావేశంలో చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్, డోమినికన్ రిపబ్లిక్ అధ్యక్షుడు లూయిస్ ఉన్నారు.

**అక్టోబర్ 7 నాటి ఘటన మర్చిపోలేం: కమలా హ్యారిస్ :** గాజాలో పౌర మరణాలు జరగకుండా ఏవైనా నిబంధనలు విధించి ఇజ్రాయెల్‌కు ఆయుధాలను సరఫరా చేస్తారా..? అని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌ను లండన్‌లో విలేకర్లు ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. " మేం ఇజ్రాయెల్‌కు మద్దతు కొనసాగిస్తాం. ఒక విషయం స్పష్టం చేయదల్చుకొన్నాను. అక్టోబర్ 7న 1400 మంది అమాయక ప్రజలను చంపేశారు. ఓ కార్యక్రమానికి హాజరైన వందల మందిని హత్య చేశారు. అందుకే.. మేము మద్దతు ఇవ్వడానికి ఎలాంటి నిబంధనలు విధించదల్చుకోలేదు. యుద్ధం ఎలా చేయాలనేది మేము ఇజ్రాయెల్‌కు చెప్పదల్చుకోలేదు" అని స్పష్టం చేశారు.

**అమెరికా మద్దతు లేకపోతే కొన్ని రోజుల్లోనే ఓటమి..**

అమెరికా మద్దతు లేకపోతే కొన్ని రోజుల్లోనే ఇజ్రాయెల్ ఓడిపోతుందని ఇరాన్ అగ్రనేత అయాతుల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఆయన ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో మెసేజ్ చేశారు. ఇజ్రాయెల్‌ను యూదు సంస్థతో పోల్చారు. "యూదు సంస్థ మీకు అబద్ధం చెబుతోంది. అది నిస్సహాయంగా.. గందరగోళంలో ఉంది. అమెరికన్ల మద్దతు లేకపోతే కొన్ని రోజుల్లోనే కుప్పకూలిపోయేది" అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.




# సినిమా డైలాగ్‌ను ప్రస్తావిస్తూ.. కేసుల వరుస వాయిదాలపై సీజేఐ అసహనం

ఢిల్లీ: న్యాయస్థానాల్లో కేసులు పదేపదే వాయిదా పడటంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 3,668 కేసుల్లో వాయిదాలు కోరినట్లు వెల్లడించారు. ఈ వివరాలు వెల్లడిస్తూ.. ఆయన బాలీవుడ్ సినిమా దామినిలోని '(వాయిదా మీద వాయిదా)' అనే డైలాగ్‌ను ప్రస్తావించారు. 'ఈ ఒక్కరోజే 178 కేసులు వాయిదా వేయాలని డిమాండ్లు వచ్చాయి. ఈ న్యాయస్థానాలు వాయిదాల మీద వాయిదాలు వేసే వాటిగా ఉండాలని మేం కోరుకోవడం లేదు. దానివల్ల కేసుల్ని త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశం నెరవేరదు' అని సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలీవుడ్ చిత్రం 'దామిని'లో సన్నీడేఓల్ న్యాయవాదిగా నటించారు. ఆయన అత్యాచార బాధితురాలి తరపున కేసు వాదిస్తారు. నిందితుడి తరఫు న్యాయవాది అతడిని కేసు నుంచే తప్పించే ఉద్దేశంతో వాయిదాలు కోరతాడు. ఈ క్రమంలోనే సన్నీ "TAREEK PEH TAREEK" డైలాగ్ ఉపయోగిస్తాడు. న్యాయస్థానాల్లో ఖాళీలు, వాటి మూలంగా పెరుగుతున్న పనిభారం.. కేసుల్లో తీర్పులు ఆలస్యం అయ్యేందుకు కారణమవుతున్నాయనే వాదనా ఉంది. సుప్రీంకోర్టుతో సహా దిగువ న్యాయస్థానాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మణిపుర్, మేఘాలయ, సిక్కిం, త్రిపుర హైకోర్టులు మాత్రమే పూర్తి సిబ్బందితో సేవలు అందిస్తున్నాయి. ఇక, పెండింగ్ కేసుల విషయంలో డిసెంబర్ 31, 2022 వరకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర న్యాయశాఖ పార్లమెంట్‌కు వెల్లడించింది. జిల్లా, దిగువ స్థాయి కోర్టుల్లో 4.32 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది.


సుప్రీంకోర్టులో 69 వేలకు పైగా, హైకోర్టుల్లో 59 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఈ గణాంకాలపై అప్పటి న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఇది న్యాయమూర్తి తప్పు కాదని, వ్యవస్థలో లోపం అని అన్నారు. ఆ లోపాన్ని సరిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

# గచ్చిబౌలి ఏఐజీ నుంచి చంద్రబాబు డిశ్చార్జి



హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రి వైద్యులు ఆయన్ను డిశ్చార్జి చేశారు. చంద్రబాబు వెంట ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఉన్నారు. ఏఐజీ నుంచి ఆయన నేరుగా జూబ్లీహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి వెళ్లే అవకాశముంది. అక్కడే క్యాటరాక్టు సమస్యకు వైద్యులు చంద్రబాబుకు శస్త్రచికిత్స చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వైద్య పరీక్షల కోసం గురువారం ఏఐజీ ఆస్పత్రిలో చంద్రబాబు చేరారు. ఏఐజీకి చెందిన గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణులు డాక్టర్ కె.రాజేష్ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్‌తోపాటు కార్డియాలజీ, పల్మనాలజీ, డెర్మటాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల బృందం ఆయనకు వివిధ వైద్య పరీక్షలు సూచించినట్లు సమాచారం. రక్త, మూత్ర పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, కాలేయ, మూత్రపిండాల పనితీరు, అలర్జీ స్క్రీనింగ్ ఇతర టెస్టులు చేసినట్లు తెలుస్తోంది. జైలులో ఉన్న ఆయనకు తీవ్ర అలర్జీ, ఇతర అనారోగ్య కారణాల రీత్యా మధ్యంతర బెయిల్ లభించడంతో బుధవారం హైదరాబాద్ చేరుకున్న విషయం తెలిసిందే.

# లింగమనేనికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ




ఢిల్లీ: టీడీపీ నేత లింగమనేనికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. రుషికొండ నిర్మాణాల అంశంపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లింగమనేని శివరామ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముఖ్యమంత్రిని రుషికొండకు వెళ్లొద్దంటారా?. ఇందులో ప్రజా ప్రయోజనం ఏం ఉందని సీజే ప్రశ్నించారు. ఇది రాజకీయ ఫిర్యాదు అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. రుషికొండపై నిర్మాణాలు అక్రమం అని, సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు వ్యతిరేకంగా సుప్రీంలో లింగమనేని శివరామ ప్రసాద్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఎన్‌జీటీ, ఏపీ హైకోర్టులో ఈ విషయంపై ఉన్న కేసులు పరిష్కారం అయ్యేవరకు రుషి కొండపై ఏవిధమైన నిర్మాణాలు, కార్యక్రమాలు చేపట్టొద్దని లింగమనేని శివరామప్రసాద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లింగమనేని అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.




## అను ఇమ్మాన్యుయేల్.. ఓర చూపుతో మత్తుజల్లుతూ..

మత్తెక్కించే అందచందాలో మైమరిపిస్తుంటుంది చికాగో చిన్నది అను ఇమ్మాన్యుయేల్. సొగసులన్నీ వడ్డించేస్తూ కుర్రకారులో అలజడి రేపుతుంటుంది. అసలు ఈమె పేరు వింటేనే.. ఈ ముద్దుగుమ్మ అందాలు కళ్లముందు కదలాడుతుంటాయి. తెలుగులో చేసింది తక్కువ చిత్రాలే అయినా లక్షలాది మంది అభిమానుల్ని దక్కించుకుంది. తాజాగా మరోసారి క్యూట్ ఫొటోషూట్‌లో కనిపించి కుర్రాళ్లను ఫిదా చేసింది. వివరాళ్లోకి వెళితే.. మలయాళం మూవీలో 'స్Sw' చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన ఈ ముద్దుగుమ్మ.. 'యాక్షన్ హీరో బిజు' చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. 2016లో మజ్ను సినిమాతో టాలీవుడ్ అరంగేట్రం చేసిన ఈ భామ.. నేచురల్ స్టార్ నానీ పక్కన నటించి



మెప్పించింది. తొలి చిత్రంతోనే యూత్‌ను మాయ చేసింది. ఆ తర్వాత కిట్టు ఉన్నాడు జాగ్రత్త, ఆక్సిజన్ చిత్రాలతో మెప్పించింది. ఈ చిత్రాలతో ఆమెకు మంచి పేరు వచ్చింది. అనంతరం పవన్?తో అజ్ఞాతవాసి, అల్లు అర్జున్‌తో నా పేరు సూర్య వంటి చిత్రాల్లో నటించి ఆకట్టుకుంది. శైలజా రెడ్డి అల్లుడు చిత్రంలో అనూ రెడ్డిగా కనిపించి ట్రెడిషనల్‌గా కనిపిస్తూనే గ్లామర్ షో చేసింది. అల్లుడు అదుర్స్, మహా సముద్రం, ఊర్వశివో రాక్షసివో, రీసెంట్‌గా మాస్ మహారాజా హీరోగా వచ్చిన రావణాసుర చిత్రంలోనూ అవకాశాలను దక్కించుకుని నటించి మెప్పించింది. కేవలం తెలుగులోనే కాకుండా మలయాళం, తమిళ భాషల్లోనూ చాలానే సినిమాలు చేసింది. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు ట్రెండీ ఔట్ ఫిట్లు ధరిస్తూ.. తన హాట్ హాట్ అందాలను ఆరబోస్తుంటుంది. తాజాగా మరోసారి క్యూట్ ఫొటోస్ షేర్ చేసింది. ఇందులో కాఫీ కలర్ బ్రౌన్ ప్రింటెండ్ డ్రెస్ ధరించి పోజులిచ్చింది. పూల డిజైన్‌తో సింపుల్‌గా ఉన్న డ్రెస్‌లో తన క్యూట్ గ్లామర్‌తో తళుక్కుమంది. సూటబుల్? జుంకీలు కూడా ధరించి ఆకట్టుకుంది. ఒక్కో ఫొటోలో ఒక్కోలా హొయలు ఒలికించింది.

ఒక్క పిక్‌లో మాత్రం లై ట్ క్లీవేజ్ షో చేసింది. ఈ బ్యూటిఫుల్ ఫొటోలు చూసిన నెటిజన్లు కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. త్వరలోనే ఈ భామ కార్తి జపాన్ చిత్రంతో అలరించనుంది.

## మెగాస్టార్ 156 లో రకుల్ ప్రీత్ సింగ్!

మెగాస్టార్ చిరంజీవికి హీరోయిన్లు సెట్ అవ్వడం ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తమన్నా..కాజల్ అగర్వాల్..నయనతార లాంటి భామలు నటించడంతో మళ్లీ వాళ్లని రిపీట్ చేయలేని పరిస్థితి. కొత్త హీరోయిన్ తీసుకుంటే చిరంజీవికి వయసుకు మ్యాచ్ అవ్వడం కష్టం అవుతుంది. ఫాంలో ఉన్న ఏ భామని తీసుకురావలన్నా వయసు అడ్డంకిగా మారుతుంది. మరికొంత మంది హీరోయిన్లు ఆ యవసున్న హీరోలకు చెల్లెళ్లుగానూ నటించడంతో! వెంటనే వాళ్లని ఎంపకి చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో 156..157 చిత్రాల్లో హీరోయిన్లగా ఎవరు ఎంపిక అవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. 157వ సినిమాకి సంబంధించి అనుష్క..నయనతారని పరిశీలిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే లోపు వాళ్లిద్దరిలో ఎవరో ఒకర్ని లాక్ చేసే అవకాశం ఉంది. మరి 156వ సినిమాలో హీరోయిన్ పరిస్థితి ఏంటి? అంటే తాజాగా ఈ విషయం వెలుగులోకి వస్తుంది. ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అన్నది ఇంకా నిర్మాతలు ప్రకటించలేదు. స్వయంగా చిరంజీవి పెద్దకు మార్తె సుస్మిత ఈ చిత్రాన్ని నిర్మించడంతో ఆమె అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ



నేపథ్యంలో మెగాస్టార కి జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ ని రంగంలోకి దించే ఆలోచనలో రామ్ చరణ్ ఉన్నట్లు తెలిసింది. రకుల్ ఇప్పటికే తెలుగులో చాలా సినిమాలు చేసింది. వెల్ నోన్ పేస్. సీనియర్ భామలకు సరితూగే భామే. చరణ్ కి మంచి స్నేహితురాలు. గతంలో తని ఒరువన్ రీమేక్ లో నటించింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతుంది. ఇప్పుడా స్నేహంతోనే డాడ్ కి హీరోయిన్ గా రకుల్ ఒప్పిస్తున్నట్లు సమాచారం. చరణ్ మాటను ఆమె కాదనే అవకాశం లేదు. పైగా చిరంజీవితో ఛాన్ అంటే ఏ హీరోయిన్ కాదంటుంది. ప్రస్తుతం రకుల్ ప్రీత సింగ్ విశ్వనటుడు కమల్ హాసన్ సరసన 'ఇండియన్ -2' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అందులో ఓ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నా! రకుల్ పాత్రకి ఎ క్కువ ప్రాధాన్యత ఉంటుందని సమాచారం. ఆరకంగా తొలిసారి సీనియర్ హీరోతో రకుల్ తెరను పంచుకుంటుంది. తాజాగా చిరంజీవి సరసన షురూ చేసిందంటే? తిరుగుండదు. అటుపై నాగార్జున..బాలయ్య..వెంకటేష్ లాంటి హీరోలకు అమ్మడు ప్రమోట్ అవుతుంది. ఇప్పటికే ఓ తరం హీరోలందర్నీ అమ్మడు కవర్ చేసింది. ఆ అనుభవాన్ని రంగరించి సీనియర్లతో సై అనేస్తే సరి.

## హనుమాన్.. పోటీలో ఎంత బలంగా ఉన్నాడంటే..




2024 సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద నెవెర్ బిఫోర్ అనేలా వాతావరణం కనిపించబోతున్నట్లుగా అర్థమవుతుంది. పెద్ద సినిమాలు వస్తే మీడియం రేంజ్, చిన్న బడ్జెట్ సినిమాలు కాస్త వెనుకడుగు వేసే ప్రయత్నం అయితే చేస్తాయి. కానీ ఈసారి ఏ సినిమా కూడా సంక్రాంతి పోటీ నుంచి వెనక్కి తగ్గాలని అనుకోవడం లేదు. వీలైనంతవరకు గాసిప్స్ వచ్చిన ప్రతిసారి కూడా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో మేజర్ గా వాయిదా పడతాయి అనుకున్న సినిమాలే సంక్రాంతికి రాబోతున్నట్లుగా పదేపదే క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆ లిస్టులో మొదటగా హనుమాన్ సినిమా నిలుస్తోంది. తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాపై బజ్ అయితే బాగానే ఉంది. అయితే ఈ సూపర్ హీరో సినిమాకు సంక్రాంతి టైంలో థియేటర్లు దొరుకుతాయా లేదా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సినిమా వాయిదా పడవచ్చు అని గాసిప్స్ పుట్టుకొస్తున్న తరుణంలో మళ్ళీ చిత్ర యూనిట్ మరోసారి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం అయితే చేసింది. సంక్రాంతికి విడుదల కాబోతున్న సినిమాలలో అన్ని పనులు పూర్తి చేసుకున్న ఏకైక సినిమా తమదే అన్నట్లుగా వివరణ ఇచ్చారు. ఫస్ట్ కాపీ కూడా రెడీ అయిపోయింది అని ఇక కేవలం సినిమాను విడుదల చేయడమే తరువాయి భాగం అన్నట్లుగా కూడా బలంగా చెబుతున్నారు. సంక్రాంతికి రవితేజ ఈగల్ వాయిదా పడవచ్చు అని కూడా గాసిప్స్ రాగా అందులో నిజం లేదు అని ఆ చిత్ర నిర్మాతలు కూడా తేల్చేశారు. రీసెంట్గా గుంటూరు కారం నిర్మాత నాగ వంశీ కూడా సంక్రాంతికి మాదే అప్పర్ హ్యాండ్ అనేలా గట్టిగా చెప్పారు. ఇక పోటీలో ఉన్న దిల్ రాజు ప్రొడక్షన్ మూవీ ఫ్యామిలీ స్టార్ కూడా అంత ఈజీగా వెనక్కి తగ్గకపోవచ్చు. వెంకటేష్ సైంధవ సినిమా అయితే ఎప్పుడో రిలీజ్ డేట్ పై కూడా క్లారిటీ ఇచ్చింది. ఇక ఒక నాగార్జున మాత్రం పదేపదే క్లారిటీ ఇవ్వడం లేదు కానీ ఆయన సంక్రాంతి సెంటిమెంట్ ను నమ్ముకుని నా సామి రంగ సినిమాను గట్టిగానే విడుదల చేసే ఛాన్స్ అయితే ఉంది. ఇక వీటన్నిటిలో కూడా హనుమాన్ సినిమా మాత్రం మినిమం థియేటర్స్ అందుకునే ఛాన్స్ ఉన్నట్లుగా మేకర్స్ అయితే చెబుతున్నారు. ఇప్పటికే ఒక బిగ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థతో ఒప్పందం కూడా చేసుకున్నట్లు చెబుతున్నారు. మరి వీరి ప్రణాళికలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## మీమ్స్‌తో కథ.. నితిన్ ఎక్స్‌ట్రా వర్కౌట్ అవుద్దా!



ఓ కథ పుట్టడం అంత సులువు కాదు. అయితే పుట్టిన ప్రతీ కథకు తప్పకుండా ఏదో ఒక మూలం ఉంటుంది. అది నిజ జీవితంలో జరిగిన సంఘటన లేదా ఏదైనా ఊహాతీతం అయినా ఉండొచ్చు.దాన్నే కథగా తీర్చిదిద్ది సినిమాగా మారుస్తుంటారు దర్శకరచయితలు. అయితే ఇప్పుడు ఫిల్మ్ ఇండస్ట్రీలో దర్శకరచయితలు మీమ్స్ మీద పడబోతున్నారని అర్థమవుతోంది. తాజాగా దర్శకుడు వక్కంతం వంశీ దీనికి నాంది పలికారు. ఆయన తెరకెక్కిస్తున్న ఎక్స్‌ట్రా ఆర్డినరీ సినిమా టీజర్ రిలీజైంది. ఇందులో బాహుబలి మీమ్‌ను ఉపయోగించి ఓ సన్నివేశాన్ని క్రియేట్ చేశారు. సినిమాలో హీరో నితిన్‌ను జూనియర్ ఆర్టిస్ట్‌గా బాహుబలి దండాలయ్య సాంగ్‌లో ఉన్నట్లు ఓ ఫన్నీ కామెడీని క్రియేట్ చేశారు. గతంలో బాహుబలి ట్రైలర్ రిలీజైనప్పుడు ఇలాంటి స్పూఫ్ మీమ్స్ చాలా వైరల్ అయ్యాయి. దాన్నే తీసుకుని తన సినిమాలో సన్నివేశాన్ని క్రియేట్ చేశారు వక్కంతం వంశీ. అసలే ఇప్పుడు సోషల్ మీడియాలో మీమ్స్‌కు ఉన్న క్రేజే వేరు. ముఖ్యంగా సినిమాకు – మీమ్స్‌కు విడదీయరాని బంధం ఉంది. ఓ చిత్రంలోని సన్నివేశాలకు.. ప్రస్తుత సందర్భానికి తగ్గట్టుగా మార్చి ఫుల్ కామెడీని పండిస్తుంటారు మీమర్స్. అయితే ఇప్పుడు కాస్త కథను రివర్స్ చేసి.. ఏకంగా తన ఎక్స్‌ట్రా ఆర్డినరీ సినిమా కోసం మీమ్స్?ను వాడేశారు వక్కంతం వంశీ. వాస్తవానికి ఓ సింగిల్ మీమ్?తో పూర్తి కథను నడిపించలేం కదా.. అందుకే తన చిత్రం కోసం జూనియర్ ఆర్టిస్‌లపై వచ్చిన చాలా మీమ్స్?ను ఉపయోగించి తనదైన స్టైల్?లో హిలేరియస్‌గా కథను చూపించబోతున్నట్లు సమాచారం అందింది. ఫైనల్‌గా కొంతమంది దర్శకులు తమ చిత్రాలతో కొత్త మీమ్స్ పుట్టుకురావడానికి కారణం అవుతుంటే.. మరికొంతమంది దర్శకులు అదే మీమ్స్‌తో కథలు రెడీ చేసే పనిలో పడిపోయారట. చూడాలి మరి వక్కంతం వంశీ ప్రయత్నించిన ఈ ఎక్స్‌ట్రా మీమ్స్ కథ డిసెంబర్ 8న బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రిజల్ట్‌ను అందుకుంటుందో. ఇకపోతే సినిమాలో శ్రీలీల హీరోయిన్?గా నటించగా.. రావురమేశ్ నితిన్?కు తండ్రిగా నటించారు. హేరిస్ జయరాజ్ సంగీతం అందించారు.

## స్టన్నింగ్ సామ్.. సిట్టింగ్ పోజులో పైటను పక్కకు జరిపి

స్టార్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చి రెస్ట్ మోడల్ ఉంటున్న సంగతి తెలిసిందే. ఆ మధ్య వెకేషన్ ట్రిప్?లు అంటూ ఫుల్ ఎంజాయ్ చేసిన ఈ భామ.. సోషల్ మీడియాలోనూ వాటిని షేర్ చేస్తూ ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంది. మధ్య మధ్యలో ఫొటోషూట్స్ కూడా చేస్తూ అభిమానులను అలరించింది. తాజాగా మరోసారి పైట పక్కకు జరిపి పింక్ కలర్ శారీలో సిట్టింగ్ పోజు ఇచ్చి ఆకట్టుకుంది. వివరాళ్లోకి వెళితే.. చూపు తిప్పుకోకుండా చేసే అందం, మైమరపించే నటనతో దాదాపు పదిహేనేళ్లుగా టాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా హవాను కొనసాగిస్తూ దూసుకుపోతోంది టాలెంటెడ్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు. గతంలో కన్నా ఆ మధ్య పుష్పతో తన స్టార్ డమ్‌ను మరింతగా పెంచుకున్న ఈ ముద్దుగుమ్మ..



వరుస పెట్టి సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ ముందుకు వెళ్తోంది. అయితే రీసెంట్‌గా మయోసైటిక్ ట్రీట్‌మెంట్ సహా కాస్త ప్రశాంతంగా ఉండేందుకు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. అయినా సోషల్ మీడియాలో యమ రచ్చ చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే తన పర్సనల్ విషయాలతో పాటు హాట్ ఫొటోషూట్స్‌ను పోస్ట్ చేస్తూ ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. అయితే ఈ మూడు నాలుగు రోజుల నుంచి వరుసగా చీరలో అందాలను ఆరబోస్తూ రోజుకో ఫొటోను పోస్ట్ చేస్తోంది. తాజాగా పింక్ కలర్ శారీలో అదిరిపోయే పిక్?ను షేర్ చేసింది. బ్యాక్ గ్రౌండ్ కలర్ కూడా మ్యాచింగ్ అయ్యేలా పింక్? వరల్డ్‌లో కనువిందు చేసింది. సిట్టింగ్ పోజులో పైటను పక్కకు జరిపి ఎద అందాలను ఎక్స్‌పోజ్ చేసింది. కాస్త స్మైలింగ్ కూడా ఇచ్చింది. ఈ ఫొటోకు ఓ వేదాంతం కూడా రాసుకొచ్చింది. "సుతిమెత్తనైన ఈ చక్కటి ఎంబ్రాయడరీ కలిగి ఉన్న పింక్ కలర్ చీర.. మీరు కలలు కనే ధైర్యాన్ని, దాన్ని సాకారం చేసుకునే అవకాశమున్న మాయాలోకానికి మార్గం చూపుతోంది. ఆకర్షితమైన ఈ మాస్టర్ పీస్ అందాలకు దాసోహమయ్యేందుకు సిద్ధంగా ఉండంది. ఎందుకంటే ఈ చక్కటి కలల ప్రపంచంలో నక్షత్రాల వెలుతురు నడుమ మీ హృదయం ఆకాశంలో తేలిపోతుంది" అని రాసుకొచ్చింది.

## శ్రియా హై గ్లామర్ డోస్.. మైండ్ బ్లోయింగ్

సీనియర్ హీరోయిన్ శ్రీయ శరణ్ హీరోయిన్ గా సినిమా అవకాశాలు అంతగా అందుకోలేకపోతున్నప్పటికీ కూడా గ్లామర్ విషయంలో మాత్రం అమ్మడు అందరిని ఆశ్చర్యపరుస్తూనే ఉంది. నేటితరం యువ హీరోయిన్స్ కు దిటుగా ఆమె తన గ్లామర్ తో సవాల్ విసురుతోంది. నాలుగు పదుల వయసు దగ్గర పడుతున్న కూడా ఇంకా పాతికేళ్ల అందంతో ఆమె ఎంతగానో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. సోషల్ మీడియాలో ఆమెకు రోజురోజుకు మరింత ఫ్యాన్ ఫాలోవర్స్ అయితే పెరుగుతున్నారు. ప్రతీ ఫ్రేమ్ లో కూడా తన గ్రామర్ హై లెవెల్ లో ఉండే విధంగా ఈ బ్యూటీ స్టిల్స్ అయితే ఇస్తుంది. ఇక రీసెంట్ గా పోస్ట్ చేసిన మరి కొన్ని ఫోటోలు చూస్తే



స్టన్ అవ్వాల్సిందే. గతంలో బికినీలో కూడా దర్శనమిచ్చిన శ్రియ ఈసారి స్కర్ట్ లో మతిపోయేలా గ్లామర్ తో ఆశ్చర్యపరిచించి. రంగురంగుల ఒక మినీ స్కర్ట్ లో అమ్మడు ఓవైపు ఎద అందాలను మరోవైపు లెగ్స్ అందాలను హైలెట్ చేస్తూ ఇచ్చిన ఫోజులు మామూలుగా లేవు. ఇక దానికి తోడు ఆమె స్మైల్ కూడా కుర్రాళ్ళను మతిపోగొట్టేస్తోంది. ఎప్పటికప్పుడు తన స్టైల్ అలాగే గ్లామర్ డోస్ విభిన్నంగా ఉండేలా ఈ బ్యూటీ జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇక ఈ ఫోటోలు నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో కంటే కాస్త సన్నబడుతున్నప్పటికీ కూడా శ్రీయ శరణ్ ఇంకా అదే గ్లో తో మెరిసి పోతోంది. ఇప్పటికీ ఆమెకు హీరోయిన్ గా కొన్ని స్పెషల్ పాత్రలకు సరైన న్యాయం చేయగలిగే సత్తా ఉన్న నటి అని చెప్పవచ్చు. ఇక ఆమెకు హీరోయిన్ గా అవకాశాలు అంతగా రావడం లేదు. ప్రస్తుతం ఆమె కొన్ని ప్రత్యేకమైన పాత్రలోనే నటించే ప్రయత్నం చేస్తుంది. కేవలం తెలుగులోనే కాకుండా ఆమెకు బాలీవుడ్ తమిళంలో కూడా ఆఫర్లు వస్తున్నాయి. ఏడాది మొదట కబ్జా సినిమాలో నటించిన అమ్మడు ఆ తర్వాత మ్యూజిక్ స్కూల్ అనే మరొక సినిమా చేసింది. కానీ అవి ఈ బ్యూటీకి అంతగా కలిసి రాలేదు. ఇక ప్రస్తుతం తమిళంలోనే ఒక సినిమా చేస్తోంది. అలాగే హిందీలో ఓ వెబ్ సిరీస్ లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. మరి ఈ గ్లామర్ తో అమ్మడు మళ్ళీ వెండితెరపై హీటెక్కించేలా స్పెషల్ ఆఫర్స్ అందుకుంటుందో లేదో చూడాలి.



# ఎవరో చెప్పిన అబద్ధాలు నమ్మి ఓటు వేయెుద్దు: కేసీఆర్

భైంసా: ఎవరో వచ్చి చెప్పిన అబద్ధాలు నమ్మి.. ఓటు వేయెుద్దని భారాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పోటీ చేస్తున్న వ్యక్తి.. అభ్యర్థి వెనక ఉన్న పార్టీ.. దాని చరిత్రను చూడాలని కోరారు. పార్టీ దృక్పథం చూసి వివేకంతో ఓటు వేయాలని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా.. ప్రజల్లో ప్రజాస్వామ్య పరిణతి రాలేదని అన్నారు. దేశంలో 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేసీఆర్ పునరుద్ఘాటించారు. "రైతుబంధు దుబారా ఖర్చు అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామంటున్నారు. అదే జరిగితే మళ్లీ పైరవీలు మొదలవుతాయి. రైతు బంధు, రైతుబీమా ఎలా వస్తాయి? రాష్ట్రంలో 24 గంటల కరెంట్‌తో వ్యవసాయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. రైతులకు కరెంట్, నీళ్లు ఉచితంగా ఇస్తున్నాం. పెట్టుబడి సాయం ఇస్తున్నాం. చాలా కష్టపడి అన్ని సమస్యలు పరిష్కరించుకున్నాం" అని కేసీఆర్ అన్నారు. రాష్ట్రానికి మోదీ సర్కార్ ఒక్క వైద్య కళాశాల కూడా ఇవ్వలేదని కేసీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకుంటే కనీసం ఒక్క నవోదయ విద్యాలయం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రాష్ట్రానికి ఏమీ ఇవ్వని మోదీ సర్కార్ ఓట్లు ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. దశాబ్దాలుగా వెనకబడి ఉన్న ఎస్సీలు బాగుపడాలనే దళితబంధు తీసుకొచ్చానని, ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకుంటామని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

**తెలంగాణ కోసమే భారాస: కేసీఆర్ –** ఆర్మూర్: దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం మేలు చేసిందని భారాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు.

అర్మూరులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని చెబుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆదాయం పెరిగేకొద్దీ సంక్షేమ పథకాలు పెంచుతున్నామని చెప్పారు. తెలంగాణ కోసమే భారాస పుట్టిందన్న కేసీఆర్.. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

# తెలంగాణ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ పోటీ చేయట్లేదు: షర్మిల




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయడం లేదని శుక్రవారం ఆమె మీడియాకు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోయే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని.. అందుకే కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకే ఎన్నికల్లో పోటీ చేయకూడదని తాము నిర్ణయించామని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు అవకాశాలను అడ్డకోకూడదనే ఈ కీలక నిర్ణయాన్ని తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులన్నా, కార్యకర్తలన్నా తనకు అపారమైన గౌరవం ఉందని, ఢిల్లీ వెళ్లి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను కలిసినప్పుడు... తనను కుటుంబ సభ్యురాలిగా వారు చూశారని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకున్నామని... తమ పార్టీ తరపున పలువురిని ఎన్నికల బరిలో నిలపాలని తాను అనుకున్నానని చెప్పారామె. తాను ఎమ్మెల్యేగా గెలిచి, అసెంబ్లీలో అడుగు పెడతాననే పూర్తి నమ్మకం తనకు ఉందని తెలిపారు. తెలంగాణ ప్రజల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామన్న ఆమె.. ఈ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులందరూ అర్థం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ రాకుండా కుట్రలు చేసిన వారందరూ ఒక్కటయ్యారు: హరీశ్‌రావు



సంగారెడ్డి: తెలంగాణ వ్యతిరేకులతోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దోస్తానా చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ రాకుండా కుట్రలు చేసిన వారందరూ ఒక్కటయ్యారన్నారు. అసలైన తెలంగాణ వ్యతిరేకి.. రేవంత్ రెడ్డి కాదా.. అని ప్రశ్నించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణ గెలవాలంటే ప్రజలు కేసీఆర్ వైపు ఉండాలి. తెలంగాణ ఓడాలంటే రేవంత్ రెడ్డి అండ్ గ్యాంగ్ వైపు నిలవాలి. రేవంత్ ఎలాంటి వాడో నిన్న గాంధీ భవన్‌లో చూశాం. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లి వచ్చింది ఎవరో చూశాం. ఉస్మానియా విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిందెవరు?క్రిమినల్ ఎవరో.. ఆ మైండ్ సెట్ ఎవరిదో అందరికీ తెలుసు. కాంగ్రెస్‌కు ఓటేసి కర్ణాటక ప్రజలు మోసపోయారు. అభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా తెలంగాణ మారుతుంది. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రిస్క్ తీసుకోవడం ఎందుకు?" అని హరీశ్‌రావు అన్నారు.

# రాహుల్.. మా బలం నీకు తెలియదు: ఒవైసీ




సంగారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. డబ్బులు తీసుకుని బీజేపీ కోసం పని చేస్తున్నారంటూ రాహుల్ చేసిన ఆరోపణలపై ఒవైసీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం మతపరమైన విద్వేషం కారణంగానే రాహుల్ గాంధీ తనపై అలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఒవైసీ అంటున్నారు. సంగారెడ్డిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఒవైసీ, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందించారు. 'కర్ణాటక ఎన్నికల సమయంలో ఢిల్లీలోని నా ఇంటికి రాహుల్ ఒకరిని పంపారు. ఆ రహస్యం ఏంటో చెప్పమంటారా?.. నేనూ మీ గురించి చాలా చెప్పగలుగుతా' అంటూ రాహుల్‌ను ఉద్దేశించి ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమేథీలో ఓడిపోవడానికి బీజేపీ దగ్గరి నుంచి ఎంత తీసుకున్నారు. మీ స్నేహితులు సింధియా, జితిన్ ప్రసాదలు బీజేపీలో చేరారు. కానీ, వాళ్లెవరిపైనా డబ్బులు తీసుకున్నారంటూ ఆరోపణలు మీరు చెయ్యరు. ఎందుకంటే.. మీకు(రాహుల్) మేమంటే ద్వేషం" అని ఒవైసీ ప్రసంగించారు. కావాలనే రాహుల్ నాపై ఆరోపణలు చేస్తున్నారు. నా పేరు అసదుద్దీన్ కాబట్టే రాహుల్ ఈ ఆరోపణలు చేశారు. నెత్తిన టోపీ, గడ్డం ఉంది కాబట్టే ఈ ఆరోపణలు చేశారు. కానీ, రాహుల్‌కు మా బలమేంటో తెలియదు. మా బలమేంటో గుర్తించే ఇందిరా గాంధీకి దారుస్సలాంకు వచ్చారు. రాహుల్.. ఈ గడ్డం టోపీదారులే రాహుల్‌కు త్వరలో బుద్ధి చెప్తారు అని ఒవైసీ వ్యాఖ్యానించారు. "మీ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో పట్టుబడితే.. మీరు ఎందుకు నోరు మెదపరు.

ఎంపీప్రభాకర్‌పై మీ కార్యకర్త దాడి చేస్తే ఎందుకు ప్రశ్నించలేదు?. దమ్ముంటే నాపై బరిలోకి దిగు.. తాడోపేడో తేల్చుకుందాం అని రాహుల్‌కు ఒవైసీ సవాల్ విసిరారు. తెలంగాణ పర్యటనలో భాగంగా.. బుధవారం ఓ ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. "పలు రాష్ట్రాల్లో బీజేపీ నుంచి డబ్బు తీసుకుని.. కాంగ్రెస్‌పై అభ్యర్థులను నిలబెడుతోంద"ని ఎంఐఎంపై ఆరోపణలు చేశారు.

# కోనాయిపల్లికి సీఎం కేసీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రేపు సిద్ధిపేటకు వెళ్లనున్నారు. అక్కడి కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఎన్నికల్లో నామినేషన్లు వేసే ముందు ప్రతిసారి కేసీఆర్ ఈ ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారు. అయితే.. ఈసారి వరుస బీఆర్ఎస్ సభలు.. మధ్యలో యాగం, సమయాభావ పరిస్థితులు, పైగా రేపు శనివారం కావడంతో ఈసారి ముందుగానే ఈ ఆలయంలో పూజలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల9వ తేదీన గజ్వేల్‌తో పాటు కామారెడ్డి లోనూ కేసీఆర్ నామినేషన్లు వేయనున్నారు. అదే రోజు సాయంత్రం కామారెడ్డి బీఆర్ఎస్ ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం లోని కోనాయిపల్లి గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది.

కేసీఆర్‌కు ఇది సెంటిమెంట్ దేవాలయం. ఏ ఎన్నికలు వచ్చినా ఇక్కడ పూజలు చేసిన తర్వాతే నామినేషన్ వేస్తారు. 1985లో మొదటిసారి సిద్ధిపేట ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లలో జరిగిన ఎన్నికల సమయంలో.. ఈ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు నిర్వహించి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లో ఆయన విజయం సాధించారు. మరో విశేషం ఏంటంటే.. 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఆపై ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్(ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీ ప్రకటన చేశారాయన.




రాయ్‌పుర్: మరికొద్ది రోజుల్లో ఛత్తీస్‌గఢ్‌లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భాజపా, ఇతర పార్టీల నేతల ప్రచారం జోరందుకుంది. ఓటర్లను ఆకట్టుకునేందుకుగానూ హామీల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా భాజపాకు సంబంధించిన మేనిఫెస్టో ను కేంద్ర హెూంమంత్రి అమిత్ షా విడుదల చేశారు. పెళ్లయిన మహిళలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం సహా మొత్తం 20 హామీలను అందులో ప్రకటించారు. తమను గెలిపిస్తే వచ్చే ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్‌ను పూర్తిగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అమిత్ షా ఈ సందర్భంగా ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే పండరియాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘెల్‌పై విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానాను ఏటీఎంగా మార్చేసి.. దిల్లీకి తరలిస్తున్నట్లు ఆరోపించారు. ఆయన్ను కాంగ్రెస్ పార్టీ తయారు చేసిన 'ప్రీపెయిడ్ సీఎం'గా అభివర్ణించారు. బఘెల్ మరోసారి అధికారంలోకి వస్తే.. రాష్ట్రం నుంచి రూ.వేల కోట్లను కాంగ్రెస్ పార్టీ స్వాహా చేస్తుందని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దఫాల్లో జరగనున్నాయి. తొలి విడతలో 20 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 7న, రెండో విడతలో మిగతా 70 స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరగనుంది.

**కీలక హామీల్లో కొన్ని..** రెండేళ్లలో లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పేద కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, క్వింటాలుకు రూ.3100 చొప్పున ధాన్యానికి మద్దతు ధర, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం, మహిళలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం, రాయ్‌పుర్, నయా రాయ్‌పుర్, దుర్గ్, భిలాయ్ ప్రాంతాల అభివృద్ధి కోసం దిల్లీ ఎన్‌సీఆర్ మాదిరి రాష్ట్ర రాజధాని ప్రాంతం (ఎస్‌ఈఆర్) ఏర్పాటు.




# నాలుగు సెట్ల నామినేషన్లు.. ఒకదానికే డిపాజిట్: వికాస్ రాజ్

హైదరాబాద్: నోటిఫికేషన్ల జారీతో తెలంగాణలో నామినేషన్ల దాఖలు ప్రారంభమైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. నవంబర్ 30వ తేదీన 13 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా చోట్ల 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం మినహా మిగతా రోజుల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు వికాస్‌రాజ్ వెల్లడించారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయెుచ్చని.. డిపాజిట్ మాత్రం ఒక్కదానికే చెల్లించాలన్నారు. అఫిడవిట్‌లో అన్ని కాలమ్స్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అక్టోబరు 31వ తేదీ వరకు వచ్చిన ఓటు హక్కు దరఖాస్తులను నవంబరు 10వ తేదీ వరకు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఓటరు ఇన్‌ఫర్మేషన్ స్లిప్పులు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు వికాస్ రాజ్ వెల్లడించారు. "ఇప్పటికే 2 వేల పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోంది. ఈ సారి పట్టణ ప్రాంతాల్లోనూ ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడతాం. 18వేల వీల్‌ఛైర్లు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో కొత్తగా 9.10 లక్షల మంది యువత ఓటు నమోదు చేసుకున్నారు. యువ ఓటర్లను ఆకట్టుకునేలా కార్యక్రమాలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు రూ.453 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నాం. మొత్తంగా 362 కేసులు, 256 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సీ విజిల్ యాప్ ద్వారా 2,487 ఫిర్యాదులు వచ్చాయి. అనుమతుల కోసం 9,630 దరఖాస్తులు వచ్చాయి. 205 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. స్వాధీనం చేసుకున్న నగదుకు ఆధారాలు ఉంటే జిల్లా కమిటీల ద్వారా త్వరగా విడుదల చేయాలని ఆదేశించాం. వీలైనంత వరకు సామాన్యులకు ఇబ్బందులు లేకుండానే మార్గదర్శకాలు జారీ చేశాం" అని సీఈవో వికాస్ రాజ్ వెల్లడించారు.

**ప్రలోభాలను కట్టడి చేయాలన్నదే లక్ష్యం..** "ఇప్పటివరకు 137 ఎంసీసీ ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయి. 13 భారాస, 16 కాంగ్రెస్, 5 భాజపా, 3 బీఎస్పీకి సంబంధించి అనుమానిత కేసులు ఉన్నాయి. రైతుబంధు విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి విజ్ఞప్తి రాలేదు. ప్రలోభాలను కట్టడి చేయాలన్నదే ఈసీ లక్ష్యం.

రెవెన్యూ ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఆయా విభాగాలు చర్యలు తీసుకుంటున్నాయి. 375 కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలు రాష్ట్రానికి వస్తాయి. నవంబర్ 2 తేదీ నాటికి ఓటర్ల సంఖ్య 3,21,88,753గా ఉంది" అని సీఈవో వెల్లడించారు.




దిల్లీ: ధరల పెరుగుదల అంశంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రధాని మోదీ సర్కార్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. దీపావళి పండుగకు వారం రోజుల ముందు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే ప్రజలు దీపావళి ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ పరిస్థితిపై మోదీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు.

ఉల్లిపాయలు, చక్కెర, పప్పుల ధరల పెరుగుదలను ప్రస్తావిస్తూ ప్రియాంకా గాంధీ శుక్రవారం ట్వీట్ చేశారు. "దీపావళి వారం రోజులే ఉంది.. కానీ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ధరలు అకస్మాత్తుగా పెరగడం మొదలైంది. అదే సమయంలో భారతదేశం ఉల్లిని ఉత్పత్తి చేసే రెండో అతిపెద్ద దేశం. గతేడాది రైతు సోదరులు 31లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిని ఉత్పత్తి చేశారు. అదంతా ఎక్కడుంది? ఆ బడా వ్యాపారి గిడ్డంగిలోనా? లేదంటే నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ గోదాముల్లోనే కుళ్లిపోయిందా?" అని ప్రియాంక ప్రశ్నించారు. మరోవైపు, చక్కెరతో పాటు పప్పులు సైతం పౌరులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాళ్లేం తింటారు.. మిగతా వాళ్లకు ఏం పెడతారు? ఈ దీపావళి పండుగను ప్రజలు ఎలా సంతోషంగా చేసుకోవాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ సైతం ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం, ధరల పెరుగుదల అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతుండటంతో కేంద్రంపై విమర్శలు చేస్తోంది. 2024 ఎన్నికల్లో మార్పు కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఇటీవల కాంగ్రెస్ పేర్కొంది. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ద్రవ్యోల్బణాన్ని తగ్గించే విధానాలను అమలు చేస్తామని తెలిపింది.

# అభివృద్ధికి మారుపేరైన బీఆర్ఎస్‌కే మరో అవకాశం ఇవ్వాలి: మంత్రి తలసాని

హైదరాబాద్: అభివృద్ధికి మారుపేరుగా ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కే ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి.. తెలంగాణ రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి గురించి వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాత్ర ఎంతో ఉన్నదని మంత్రి తలసాని తెలిపారు. జనం ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో హాయిగా బతుకుతున్నరని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర సర్కారు చిన్న చూపు చూస్తున్నదని ఆరోపించారు. అయినా తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అద్భుత కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తలసాని చెప్పారు. మరే రాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటున్నదని మంత్రి చెప్పారు. ఆడపిల్ల పెళ్లికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని మంత్ర పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బీఆర్ఎస్ సర్కారు అనేక పథకాలను తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. ఐటీ రంగంలో కూడా రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. కరోనా కాలంలో వలస కార్మికులను తమ ప్రభుత్వం ఆదుకున్నదని మంత్రి తలసాని గుర్తు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com